నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 19-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 113 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

ఖమ్మం, డిసెంబర్ 18:: ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతిచెందారు. దంతెవాడ జిల్లా గోండెరాస్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం స్థానిక పోలీసులు గాలింపు చేపట్టారు.

ఈ క్రమంలో శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారు.

ప్రతిగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు చనిపోయారు. వారిని మల్లన్‌గఢ్ ఏరియా కమిటీ సభ్యురాలు హిద్మే కొర్రామ్, సీఎంఎం పొజ్జెగా గుర్తించారు.

హిడ్మె తలపై రూ.5 లక్షలు, పొజ్జె తలపై రూ.లక్ష రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో మూడు నాటు తుపాకులు, యుద్ధ సామాగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. తప్పించుకున్న నక్సలేట్లకోసం గాలింపు కొనసాగుతున్నదని చెప్పారు.

ఈఎన్ఎస్‌ను సందర్శించిన గవర్నర్ తమిళిసై

విశాఖపట్నం, డిసెంబర్ 18:: తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ తూర్పు నౌకాదళ కమాండ్ (ఈఎన్‌సీ) ని సందర్శించారు. నేవల్ డాక్ యార్డ్‌లోని 'స్మరణ్ స్థల్' వద్ద విధి నిర్వహణలో త్యాగం చేసిన నౌకాదళ సిబ్బందికి గవర్నర్ నివాళులర్పించారు.

నేవీ అధికారులు ఈఎన్‌సీలో గవర్నర్ తమిళిసైకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేశీయంగా రూపొందించిన, నిర్మించిన స్టీల్త్ ఫ్రిగేట్, ఐఎన్ఎస్ శివాలిక్ జలాంతర్గామిని గైడెడ్ టూర్ డాక్టర్ తమిళిసైకి అందించారు. దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడంలో భారత నౌకాదళం పాత్ర, బాధ్యతల గురించి ఈ ఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సయన్ గవర్నర్‌కు వివరిం చారు. చాలా సేపు ఈఎన్‌సీలో గడిపిన త మిళిసై.. అక్కడి విభాగాల్లో కలియదిరి గా రు. అక్కడి విషయాలను అడిగి తెల్సుకున్నారు.

ఆ పాడుబుద్ధి భారత్‌కు లేదు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ఇతర దేశంపై దాడులకు తెగబడటం, ఇతర భూభాగాన్ని లాక్కోవడం లాంటి చరిత్ర భారత దేశానికి లేదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మనస్తత్వమే భారత పాలకులకు ఉండి వుంటే, 1971 లో జరిగిన యుద్ధంలోనే వారి భూమిని ఆక్రమించుకునేవారమని, భారత్‌కు అలాంటి బుద్ధే లేదని స్పష్టం చేశారు. అయితే ఆ దేశం పేరు తాను ఉచ్చరించనని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని, అభివృద్ధి వైపు బాటలు వేస్తోందని పేర్కొన్నారు. ఫిక్కీ ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సైన్స్, టెక్నాలజీలో అద్భుతమైన నైపుణ్యం ఉన్న వారు దేశంలో ఉన్నారని, ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలకు చెందిన కంపెనీలకు భారతీయులే సీఈవోలుగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య, విద్య రంగాల్లో ప్రైవేట్, పబ్లిక్ పెట్టుబడులు పెరగాలని తాము బలంగా కోరుకుంటున్నామని, ఆ వైపుగా అడుగులు కూడా పడుతున్నాయని తెలిపారు. ఈ రెండు రంగాల్లో పెట్టుబడులను బాగా ఆకర్షించి, ప్రపంచంలోనే భారత్‌ను మెరుగైన స్థానంలో ఉంచడానికి ప్రయత్నిస్తున్నామని రాజ్‌నాథ్ అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేకి ప్రధానమంత్రి శంకుస్థాపన

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేకి శంకుస్థాపన చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి శ్రీ బి.ఎల్.వర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగం ప్రారంభిస్తూ ముందుగా 'కాకోరి' సంఘటన విప్లవ వీరులు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్, రోషన్ సింగ్‌లకు నివాళి అర్పించారు. ఈ మేరకు స్థానిక మాండలికంలో మాట్లాడుతూ- స్వాతంత్ర్య పోరాట కవులు దామోదర్ స్వరూప్ 'విద్రోహి', రాజ్ బహదూర్ వికల్, అగ్నివేష్ శుక్లాలకు ప్రధాని నివాళి అర్పించారు. "రేపు అమరవీరులైన పండిట్ రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్, ఠాకూర్ రోషన్ సింగ్‌ల సంస్మరణ దినోత్సవం. షాజహాన్‌పూర్ గడ్డమీద పుట్టి, బ్రిటిష్ పాలనను సవాలు చేసిన ఈ ముగ్గురు భరతమాత పుత్రులను డిసెంబర్ 19న ఆనాటి పాలకులు ఉరితీశారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అలాంటి వీరులకు మనమెంతగానో రుణపడి ఉన్నాం" అని ప్రధాని పేర్కొన్నారు.

గంగామాత మన దేశంలో సకల శుభాలకు, సర్వతోముఖాభివృద్ధికి మూలమని ప్రధానమంత్రి అన్నారు. గంగామాత మనకెన్నో సంతోషాలనిస్తుంది.. సకల సంకటాలనూ పోగొడుతుంది. అదే తరహాలో ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే కూడా ఉత్తరప్రదేశ్ ప్రగతికి కొత్త బాటలు వేస్తుంది. ఇది రాష్ట్రానికి ఐదు వరాలుగా మారుతుందంటూ, ఎక్స్‌ప్రెస్‌వేలు, కొత్త విమానాశ్రయాలు, రైల్వే మార్గాల నెట్‌వర్క్ గురించి ప్రధాని ప్రస్తావించారు. ఇందులో మొదటి వరం- ప్రజల సమయాన్ని ఆదా చేయడం కాగా, ప్రజల సౌకర్య-సౌలభ్యాలు పెరగడం రెండో వరమని పేర్కొన్నారు. ఇక మూడో వరం- యూపీ వనరుల సద్వినియోగం కాగా, యూపీ సామర్థ్యాల పెంపు నాలుగో వరమని, మొత్తంమీద ఉత్తరప్రదేశ్‌లో సర్వతోముఖాభివృద్ధి ఐదో వరమని ఆయన వివరించారు.

నేడు యూపీలో వనరులు ఏ విధంగా సద్వినియోగం అమవుతున్నదీ ప్రస్తుతం నిర్మాణంలోగల ఆధునిక మౌలిక సదుపాయాలే సుస్పష్టం చేస్తున్నాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. "ఇంతకుముందు ప్రజాధనాన్ని ఎలా ఉపయోగించారో మీరు స్పష్టంగా చూశారు. కానీ ఇవాళ ఉత్తరప్రదేశ్ నిధులను ఉత్తరప్రదేశ్ అభివృద్ధి కోసమే పెట్టుబడి పెడుతున్నారు" అని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్ మొత్తంగా అభివృద్ధి చెందితేనే దేశం కూడా ప్రగతి పథంలో పయనిస్తుందని ప్రధాని అన్నారు. అందుకే తమ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రధానంగా యూపీ అభివృద్ధిపైనే దృష్టి సారించిందని చెప్పారు. ఆ మేరకు 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అన్నదే తారకమంత్రంగా యూపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల కిందట పరిస్థితులు ఎలా ఉండేవో ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు మినహా ఇతర నగరాలు, గ్రామాల్లో విద్యుత్ లభ్యత లేదు. అయితే, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో దాదాపు 80 లక్షల ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడమేగాక ప్రతి జిల్లాకు ముసుపటికన్నా చాలా రెట్లు ఎక్కువగా విద్యుత్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా 30 లక్షల మందికిపైగా పేదలకు పక్కా గృహాలు అందాయని, ఇందులో భాగంగా షాజహాన్‌పూర్‌లోనూ 50వేల పక్కా ఇళ్లు నిర్మించారని గుర్తుచేశారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులందరి సొంత ఇంటి కల త్వరలోనే నెరవేరుతుందని చెప్పారు.

దేశంలో తొలిసారిగా దళితుల, వెనుకబడిన, అణగారిన వర్గాల అభివృద్ధికి వారి స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వబడిందని ప్రధాని అన్నారు. ఈ మేరకు "సమాజంలో వెనుకబడిన, అణగారినవారికి ప్రగతి ఫలాలు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యం; మా వ్యవసాయ.. రైతు విధానాల్లో ఈ భావనే ప్రతిబింబిస్తుంది" అని చెప్పారు. దేశ వారసత్వం, ప్రగతి కోసం చేస్తున్న కృషిని ఓర్వలేని అసూయతో కూడిన మనస్తత్వాన్ని ప్రధానమంత్రి విమర్శించారు. పేదలు, సామాన్యులు తమపై ఆధారపడటమే అటువంటి పార్టీలకు అవసరమన్నారు. "కాశీ నగరంలో విశ్వనాథ స్వామికి గొప్ప ఆలయం నిర్మించడం ఇటువంటివారికి కంటగింపుగా ఉంది. అయోధ్యలో శ్రీరాముని ఆలయ నిర్మాణంతోనూ వీరికి సమస్యే. పుణ్య గంగానది ప్రక్షాళన కార్యక్రమం కూడా వారికి ఒక సమస్యే. ఉగ్రవాదులను పెంచిపోషించేవారిపై సైనిక చర్యనూ వీరు ప్రశ్నిస్తారు. భారతదేశంలో తయారైన కరోనా టీకాను, దాన్ని రూపొందించిన భారత శాస్త్రవేత్తల ఘనతను వీరు ఎంతమాత్రం గుర్తించనిదీ వీరే" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న శాంతిభద్రతల పరిస్థితి ఇటీవలి కాలంలో ఏ విధంగా మెరుగుపడిందీ ఆయన గుర్తుచేశారు. ఇందుకుగాను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని కొనియాడుతూ- "యూపీ ప్లస్ యోగి.. 'బహుత్ హై ఉపయోగి' (జ.ఖ.జ.వా.ఉ.ఎ)- ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంతోపాటు ప్రజలందరూ అంటున్న మాట" అని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా వేగవంతమైన అనుసంధానంపై ప్రధానమంత్రి దార్శనికత స్ఫూర్తితోనే గంగా ఎక్స్ ప్రెస్‌వే చేపట్టబడింది. ఈ మేరకు రూ.36,200 కోట్ల వ్యయంతో 594 కిలోమీటర్ల పొడవైన ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించబడుతుంది. ఇది మీరట్‌లోని బిజౌలి గ్రామంవద్ద మొదలై ప్రయాగ్‌రాజ్‌లోని జుడాపూర్ దండు గ్రామం వరకు విస్తరించబడుతుంది. తదనుగుణంగా మీరట్, హాపూర్, బులంద్‌షహర్, అమ్రోహా, సంభాల్, బదౌన్, షాజహాన్‌పూర్, హర్దోయ్, ఉన్నావ్, రాయ్‌బరేలీ, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్ మీదుగా వెళ్తుంది. ఈ మార్గంలో పనులన్నీ పూర్తయ్యాక ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు-పశ్చిమ ప్రాంతాలను కలిపే అత్యంత పొడవైన ఎక్స్ ప్రెస్‌వే అవుతుంది. వాయుసేన విమానాలకు తోడ్పాటులో భాగంగా షాజహాన్‌పూర్‌లోని ఎక్స్ ప్రెస్‌వేపై 'ఎమర్జెన్సీ టేకాఫ్-ల్యాండింగ్' కోసం 3.5 కిలోమీటర్ల పొడవైన రన్‌వే కూడా నిర్మించబడుతుంది. ఈ ఎక్స్ ప్రెస్‌వే వెంట పారిశ్రామిక కారిడార్‌ను కూడా నిర్మించే ప్రతిపాదన ఉంది. ఈ ఎక్స్ ప్రెస్‌వే పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్యం, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాలకు ఇతోధిక తోడ్పాటునివ్వడమే కాకుండా ఈ ప్రాంత సామాజిక-ఆర్థికాభివృద్ధికి కొత్త ఉత్తేజమిస్తుంది.

త్వరలోనే దళితబంధు నిధులు విడుదల : సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 18: తరతరలాలుగా వివక్షకు గురవుతున్న దళిత సమాజం ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా ఆర్థికంగా అభివృద్ధి చేయడమే 'దళితబంధు' పథకం లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పునరుద్ఘాటించారు. ప్రగతి భవన్‌లో జిల్లాల కలెక్టర్లతో సీఎం కేసీఆర్ సమావేశమ య్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీ కింద అందించే రూ.10లక్షలు.. దళిత కుటుంబాలను ఆర్థికంగా పరిపుష్టం చేయడమే కాకుండా.. సామాజిక పెట్టుబడిగా మారి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత వేగవంతంగా పటిష్టం చేయడంలో దోహదపడుతుందని సీఎం స్పష్టం చేశారు.

దళితబంధును ఇప్పటికే ప్రకటించిన పద్ధతిలోనే ప్రభుత్వం అమలు చేస్తుందని, అందుకు సంబంధించిన నిధులను త్వరలోనే విడుదల చేస్తామని సీఎం స్పష్టం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గం, ఇప్పటికే ప్రకటించిన నాలుగు మండలాల పరిధిలో దళితబంధును ముందుగా ప్రకటించిన విధంగా అమలు చేస్తామని వివరించారు.

16 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్.. ఆందోళనలో తల్లిదండ్రులు

ముంబై, డిసెంబర్ 18: మహారాష్ట్రలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. ఒమిక్రాన్ పాజిటివ్ కేసులు కూడా అధికంగా నమోదు అవుతున్నాయి. నవీ ముంబైలో 16 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బాధిత విద్యార్థులంతా 8 నుంచి 11వ తరగతికి చెందినవారే. ఈ క్రమంలో ఆ స్కూల్లోని 600 మంది విద్యార్థులకు వైద్యారోగ్య సిబ్బంది కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి తండ్రి ఇటీవలే ఖతర్ నుంచి ఇండియాకు తిరిగొచ్చాడు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆ కుటుంబానికి కరోనా పరీక్షలు నిర్వహించగా, తండ్రికి నెగిటివ్‌గా, కుమారుడికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇక ఆ విద్యార్థితో సన్నిహితంగా మెలిగిన పిల్లలందరికీ కొవిడ్ టెస్టులు చేయగా, 16 మందికి కరోనా సోకినట్లు తేలింది. ప్రస్తుతం మహారాష్ట్రలో 10,582 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉండగా, ఒమిక్రాన్ పాజిటివ్ కేసుల సంఖ్య 40కి చేరింది.

కొత్త జోనల్ ప్రకారమే ఉద్యోగుల విభజన : సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 18:కొత్త జోనల్ విధానం ప్రకారమే ఉద్యోగుల విభజన ను చేపట్టాలని సీఎం కేసీఆర్ కలెక్టర్లను ఆదేశించారు. స్థానిక యువతకు ఉద్యోగుల కల్పనతో పాటు క్షేత్ర స్థాయిలోకి ప్రభుత్వ పాలన, నూతన జోనల్ వ్యవస్థతో అమలులోకి వస్తుందని సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రగతి భవన్‌లో జిల్లాల కలెక్టర్లతో సీఎం కేసీఆర్ సమావేశమై పలు అంశాలపై చర్చిస్తున్నారు.

వెనక బడిన మారుమూల ప్రాంతాల్లోకి కూడా ప్రభుత్వ ఉద్యోగులు వెళ్లి పనిచేయగలిగితేనే సమగ్రాభివృద్ధి సాధ్యమని సీఎం అన్నారు. నాలుగైదు రోజుల్లో ఉద్యోగుల విభజన ప్రక్రియను పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులు అయితే (స్పౌస్ కేస్) ఒకే చోట విధులు నిర్వర్తిస్తేనే వారు ప్రశాంతంగా పనిచేయ గలుగుతరని సీఎం పేర్కొన్నారు. స్థానిక యువత ఉద్యోగాలకు విఘాతం కలగకుండా మానవీయ కోణంలో స్పౌస్ కేస్ అంశాలను పరిష్కరించాలని సీఎం సూచించారు.

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన సీజేఐ ఎన్వీ రమణ

ములుగు, డిసెంబర్ 18: : యునెస్కో ప్రపంచ వారసత్వ సందపగా గుర్తించిన వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ శనివారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ములుగు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు హరితగట్టమ్మ గ్రాండ్ హోటల్ వద్ద జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాలంపేటకు చేరుకున్న సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

ఆ తర్వాత ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయాన్ని సందర్శించిన సీజేఐ దేవాలయ శిల్పకళతో పాటు రామప్ప ఆలయ విశిష్టతను తెలుసుకునేందుకు సాయంత్రం 7 గంటల వరకు ఆలయ ఆవరణ మొత్తం పరిశీలించనున్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, రాష్ట్ర హైకోర్టు ఉన్నతాధికారులు, వరంగల్ కోర్టు ఉన్నతాధికారులు, మానుకోట ఎంపీ మాలోత్ కవిత, ములుగు ఎమ్మెల్యే సీతక్క జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

కంటోన్మెంట్ రోడ్డు మూసివేత : జీహెచ్ఎంసీలో కలిపేయమంటూ మంత్రి కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, డిసెంబర్ 18:కంటోన్మెంట్ లో అక్రమంగా రోడ్లని మూసివేస్తున్నారని, దాంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు మంత్రి కేటీఆర్.

ఈ మేరకు కంటోన్మెంట్‌లో రోడ్ల మూసివేతపై కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిషన్ రెడ్డికి రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. నిబంధనల ఉల్లంఘనను కేంద్రం ఎందుకు అడ్డుకోవట్లేదని మంత్రి ప్రశ్నించారు. కంటోన్మెంట్‌లో 21 రోడ్లు నిబంధనలకు విరుద్ధంగా మూసివేశారు. మీ ప్రభుత్వం మాత్రం 2 గేట్లు మాత్రమే మూసివేశామని చెబుతుంది. కంటోన్మెంట్ బోర్డు స్థానికులకు మౌలిక సదుపాయాలు కల్పించకపోతే.. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో కలిపేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

నవతరం బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని పి'ని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుండి గురువారం (డిసెంబర్ 18, 2021) 1106 గంటలకు దీనిని పరీక్షించారు. తూర్పు తీరం వెంబడి ఉన్న వివిధ టెలిమెట్రీ, రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ స్టేషన్లు, డౌన్ రేంజ్ నౌకలు క్షిపణి పథం, పారామితులను ట్రాక్ చేసి పర్యవేక్షించాయి. క్షిపణి అధిక స్థాయి ఖచ్చితత్వంతో అన్ని మిషన్ లక్ష్యాలను చేరుకునే టెక్ట్ బుక్ పథాన్ని అనుసరించింది. 'అగ్ని-పి' అనేది ద్వంద్వ రిడెండెంట్ నావిగేషన్ మరియు గైడెన్స్ సిస్టమ్‌తో కూడిన రెండు-దశల డబ్బీ సాలిడ్ ప్రొపెల్లెంట్ బాలిస్టిక్ క్షిపణి. రెండో ఫ్లైట్-టెస్ట్ సిస్టమ్‌లో విలీనం చేయబడిన అన్ని అధునాతనమైన సాంకేతికతల యొక్క విశ్వసనీయ పని తీరును ఇది నిరూపించింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ విజయం సాధించినందుకు డీఆర్‌డీఓను అభినందించారు. సిస్టమ్ యొక్క అద్భుతమైన పని తీరుపై తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనేక అదనపు లక్షణాలతో రెండో డెవలప్‌మెంట్ ఫ్లైట్ ట్రయల్‌ను నిర్వహించినందుకు గాను రక్షణ శాఖ ఆర్ అండ్‌డీ విభాగం కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మెన్ డాక్టర్ జి సతీష్ రెడ్డి.. డీఆర్‌డీఓ బృందం చేసిన ప్రయత్నాను అభినందించారు. దీనికి తోడు అదే క్యాలెండర్ సంవత్సరంలో వరుస విజయం సాధించినందుకు ఆయన బృందానికి అభినందనలు తెలిపారు.

విద్యావ్యవస్థను భారతీయీకరణ చేయాలి: వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: భారతదేశం చరిత్ర, విజ్ఞానఖనిగా ఉన్న గుర్తింపును గుర్తుచేసుకుంటూ మరోసారి ప్రపంచానికి మన దేశాన్ని జ్ఞానప్రదాయినిగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నెరవేర్చాలని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రస్తుత మన విద్యావిధాన్ని భారతీయీకరించాల్సిన అవసరం ఉన్నదని నొక్కిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ఈ దిశగా మనం వేయబోతున్న గొప్ప ముందడుగన్నారు. భారతదేశాన్ని సృజనాత్మకతకు, మేధోసంపత్తికి కేంద్రంగా మార్చే దిశగా నూతన జాతీయ విద్యావిధానం ఎంతగానో తోడ్పడుతోందన్నారు. శనివారం విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రుషిహుడ్ విశ్వవిద్యాలయాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

విశ్వగురుగా భారతదేశం ప్రపంచానికి మార్గదర్శనం చేసిన చరిత్రను ప్రతి భారతీయుడు గుర్తుంచుకోవాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. నలంద, తక్షశిల, పుష్పగిరి వంటి మన విశ్వవిద్యాలయాలకు ప్రపంచం నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చి జ్ఞానాన్ని సముపార్జించుకునేవారని అన్నారు. అంతటి గొప్ప విశ్వగురు స్థానాన్ని తిరిగి పొందేందుకు మన విద్యావ్యవస్థ కృషిచేయాలన్నారు. ఈ దిశగా రుషిహుడ్ విశ్వవిద్యాలయం ఎంచుకున్న మార్గాన్ని ఉపరాష్ట్రపతి అభినందించారు. విద్యతోపాటు విలువలు, మన సంస్కృతి, సంప్రదాయాలను. పరిశోధనాత్మకత, సృజనాత్మకతలను బోధించినప్పుడే ఆ ఉన్నతస్థానానికి చేరగలమన్నారు. ప్రాచీన విద్యావిధానాన్ని వెలుగులోకి తెస్తూ భవిష్యత్ యువతరానికి మార్గదర్శనం చేయడంలో రుషిహుడ్ విశ్వవిద్యాలయం విజయం సాధించాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, రుషిహుడ్ విశ్వవిద్యాలయ చాన్సలర్ సురేశ్ ప్రభు, విశ్వవిద్యాలయ సహ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్మయ్ పాండ్య, మోతీలాల్ ఓస్వాల్, అశోక్ గోయల్‌తోపాటు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడిమెట్లలో పేలుడు.. ఇద్దరికి గాయాలు

హైదరాబాద్, డిసెంబర్ 18: జీడిమెట్ల సుభాష్ నగర్‌లో శనివారం ఉదయం పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్లాస్టిక్ గోడౌన్‌లో కెమికల్ డబ్బాని కట్ చేస్తుండగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి గోడౌన్ కుప్పకూలిపోయింది. ఇద్దరు క్షతగాత్రులను మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. పేలుడు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

వేములవాడ దేవస్థాన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష!

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి): శాసనసభ్యులు రమేష్ వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఎం.పురుషోత్తం రెడ్డి తో కలిసి వేములవాడ దేవస్థానం ప్రాంగణంలో దేవాలయ అభివృద్ధి పురోగతి పనులపై శనివారంసమీక్షించారు. కరోనా కారణంగా అభివృద్ధి పనులు ఆటంకం కలిగిందని అయినా దేవస్థాన అభివృద్ధికి అంచెలంచెలుగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, 160 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుడి చెరువు అభివృద్ధికి 90 కోట్లు మంజూరయ్యి 50 కోట్ల పనులు పూర్తి అయినాయని,30 కోట్లతో 30 ఎకరాలు సేకరించామని, ఇందులో కళ్యాణ కట్ట, పుష్కరిణి, క్యూ కాంప్లెక్స్, శివకళ్యాణం చూసే విధంగా స్టేడియం, 2 వేల మందికి అన్నదాన సత్రం మొదలగు రానున్నాయన్నారు. 23 కోట్లతో బండ్ నిర్మాణానికి 23 ఎకరాల స్థల సేకరణ జరగబోతున్నదని, త్వరలో 120 మీటర్ల పొడవుతో స్నాన ఘట్టాలు తయారు కానున్నాయని, 15 కోట్లతో మిడ్ మానేరు నుండి 365 రోజులు పుష్కలంగా నీళ్లు ఉండేవిధంగా ఏర్పాటు చేసుకున్నామని, బద్ధీ పోచమ్మ పనులు త్వరలో చేపట్టనున్నామని, ప్రస్తుతం గుడి 2 గంటలలో వున్నదని దీనిని ఒక ఎకరంలో విస్తరించడానికి అవసరమయ్యే స్థల సేకరణ జరగబోతున్నదని షట్టర్లు కోల్పోయిన వారికి షట్టర్లు ఇస్తామని అవసరమైన వారికి దేవస్థానంలో ఉపాధి కల్పిస్తామని, గజానికి 30 వేలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా వున్నదని దీనికి స్థలంను కోల్పోతున్న వారు సహకరించేయాలన్నారు. బ్రిడ్జ్ నుండి పోలీసు స్టేషన్ వరకు రెండుబిట్లుగా 80 ఫీట్లతో రోడ్ వైడెనింగ్ జరగబోతున్నదని అందుకు రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ కూడా తయారయ్యిం

దన్నారు. బతుకమ్మ తెప్ప వద్ద బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, 9 కోట్లతో భూమిని సేకరించి జంక్షన్ బ్యూటిఫికేషన్ చేయనున్నామని, నాంపల్లి గుట్ట అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని, మహాలక్ష్మీ టెంపుల్ దగ్గర బ్రిడ్జి నిర్మాణం ద్వారా నాంపల్లి గుట్టకు 2వ ఘాట్ రోడ్కు ప్రణాళిక సిద్ధంగా ఉన్నదన్నారు. ఇటీవల మంజూరైన 20 కోట్ల నిధుల పనులు త్వరలో చేపట్టబోతున్నామని,రూ. 42 కోట్లతో మిషన్ భగీరథ పనులు దాదాపు పూర్తి అయినాయని, రెండవ బ్రిడ్జ్ పనులు మొదలు పెట్టారని పట్టణం చుట్టూ 125 కోట్లతో డబల్ రోడ్లు నిర్మాణం అయ్యాయని, కొత్త బస్ స్టాండ్ నిర్మాణానికి నోటిఫికేషన్ ఇచ్చామని, భక్తులకు ధర్మగుండంలో, వసతి గదులలో 24 గంటలు నీరూ వుండే విధంగా 5 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా పైప్ లైన్ నిర్మించామని, వేములవాడ దేవస్థానం, పట్టణాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. 33 కోట్

కనీస వివాహ వయస్సు పెంచితే సమస్య తీరుతుందా..!

(భారత కేంద్ర మంత్రివర్గం అమ్మాయిల కనీస పెళ్ళీడును 21కి పెంచే చట్ట సవరణకు తీర్మానించిన వేళ)

అమ్మాయిల కనీస వివాహ వయస్సును ప్రస్తుత 18 ఏండ్ల నుంచి 21 ఏళ్ళకు పెంచడానికి నిర్ణయించిన కేంద్ర మంత్రివర్గం 15 డిసెంబర్‌న తీర్మానం చేయడం, ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే చట్ట సవరణకు పూనుకోవడం ముదావహం. ఈ చట్ట సవరణతో పురుషులతో పాటు మహిళలకు కూడా కనీస వివాహ వయస్సు 21 ఏండ్లు కానుంది. గత ఏడాది ఆగష్టు-2020 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, భరతమాత బిడ్డలు, సోదరీమణుల సమగ్రాభివృద్ధి దిశగా అమ్మాయిల వివాహ వయస్సును పెంచాల్సిన అవసరాన్ని ప్రతిపాదించడం మనకు తెలుసు. కనీస వివాహ వయస్సు చట్టబద్ధతతో బాల్య వివాహాలు, మైనర్ బాలికలపై లైంగిక హింసలు తగ్గుతాయని భావిస్తున్నాం. హిందూ వివాహ చట్టం, 1955 ప్రకారం అబ్బాయిలకు 21, అమ్మాయిలకు 18 ఏండ్ల కనీస వయస్సును నిర్ణయించారు. ఇస్లామ్ మత మహిళలు యుక్తవయస్సు (ప్యుబెర్టీ) తరువాతనే వివాహానికి అర్హత సాధిస్తారు. ప్రత్యేక వివాహ చట్టం, 1954తో పాటు బాల్య వివాహ నిరోధ చట్టం, 2006 ప్రకారం మహిళలకు 18, పురుషులకు 21 ఏళ్ళు కనీస వివాహ వయస్సుగా నిర్ణయించారు. ప్రస్తుతం ప్రభుత్వ తీసుకున్న 21 ఏళ్ళ కనీస అమ్మాయిల వివాహ వయస్సు నిర్ణయంతో ఈ చట్టాలతో పాటు అనువంశిక, విడాకులు, భరణం (మేంటెనెన్స్) సంబంధ చట్టాలను కూడా సవరించాల్సి ఉంటుంది.

కనీస వివాహ వయస్సు 21 ఏండ్లు ఎందుకు..?

పురుషుల కనీస వివాహ వయస్సుతో సమానంగా మహిళల వివాహ వయస్సును 21 ఏండ్లుగా చట్ట సవరణ చేయాలనే నిర్ణయం వెనుక అనేక జాతి హిత ప్రయోజనాలు ఉన్నాయని అవగతం అవుతున్నది. అనాదిగా భారత్ ఆశించిన లింగ సమానత్వ సాధన, మహిళా సాధికారత, మాతా శిశు మరణాల రేటును తగ్గించడం, మాతా శిశు శారీరక మానసిక ఆరోగ్య పరిరక్షణ, సామాజిక చైతన్యం, కుటుంబ విద్య/ఆరోగ్యం, మహిళల స్వతంత్రత పెరగడం, ఉన్నత విద్య పరిధిలోకి మహిళలను తీసుకురావడం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగడం, మహిళల ఆర్థిక స్వేచ్ఛ కలగడం, యుక్త వయస్సు చేరక పూర్వమే బాల్య వివాహాలు చేయడం, చిన్నతనంలోనే గర్భం దాల్చడాన్ని నిరోధించడం, మహిళల్లో రక్తహీనత తగ్గించడం, పోషకాహారలోపంతో తల్లిబిడ్డలు అనారోగ్యాల పాలు కాకుండా చూడడం లాంటి పలు లక్ష్యాలకు ఈ నిర్ణయం కొంత ఊరటను ఇస్తుందని భావిస్తున్నారు. ఇటీవల విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే, యన్‌యఫ్‌హెచ్‌యస్ నివేదిక ప్రకారం బాల్య వివాహాలు 2015-16లో 27 శాతం ఉండగా, 2019-20లో 23 శాతానికి తగ్గడం గమనించగా, దానిని మరింత వేగంగా తగ్గించడానికి ఈ నిర్ణయం దోహదపడుతుంది.

టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు, సిఫార్సులు:

మహిళల కనీస వివాహ వయస్సును తగ్గించటానికి సంబంధించిన పూర్తి అధ్యయనం చేయాల్సిందిగా జూన్ 2020లో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి జయా జెట్లీ నేతృత్వం వహించగా నీతి ఆయోగ్ సభ్యుడు డా: వి కె పాల్, న్యాయశాఖ సభ్యుడు, నిజ్మా అక్తర్, వసుధా కామత్, దీప్తీ షా లాంటి విద్యావేత్తలతో పాటు విద్య/వైద్య/మాతాశిశు మంత్రిత్వ శాఖల సెక్రటరీలు సభ్యులుగా ఉన్నారు. విస్తార అధ్యయనం అనంతరం ఈ కమిటీ పలు సిఫార్సులతో కూడిన నివేదికను డిసెంబర్‌లోనే ప్రభుత్వానికి అందించింది. ఈ కమిటీతో పాటు దాదాపు 15 స్వచ్ఛంధ సంస్థలు మహిళా వివాహ కనీస వయస్సు విషయ అధ్యయనంలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలను, ఇతర ప్రాంతాలను సందర్శించి అన్ని కులమతాలకు చెందిన యువతీయువకుల అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నాలు చేసింది. వివాహ వయస్సు పెంపుతో పాటు దేశవ్యాప్తంగా అమ్మాయిలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు, వృత్తి నైపుణ్య కేంద్రాలు, లైంగిక విద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించింది.

వివాహ వయస్సును పెంచడం కాదు, సౌకర్యాలు పెంచాలి:

ఇలాంటి చట్టం తీసుకురావడంతో మాత్రమే అద్భుత ఫలితాలు ఆశించలేమని, సమాజంలో వివాహ వయస్సు పట్ల అవగాహన కల్పిస్తూ చట్ట సవరణ ఆవశ్యకతను వివరించాలని, దీనితో పాటు బహుముఖీన చర్యలు తీసుకోవాలని కమిటీ నివేదికలో ప్రభుత్వాన్ని కోరింది. అమ్మాయిల కనీస వివాహ వయస్సు 21 ఏండ్లకు పెంచడం వల్ల చట్ట వ్యతిరేకంగా బాల్యవివాహాలు, ముఖ్యంగా అల్పాదాయ వర్గాల్లో పెరగవచ్చని మాతాశిశు హక్కులు, కుటుంబ నియంత్రణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నిర్ణయం మహిళలకు అశనిపాతం (డిజాస్టర్ ఫర్ వూమెన్) అవుతుందని మహిళా హక్కుల బాధ్యులు గళమెత్తితున్నారు. ఇప్పటి వరకు 18 ఏండ్లలోపు అమ్మాయిలకు చట్ట వ్యతిరేకంగా విచ్చలవిడిగా 13, 14, 15 ఏళ్ళకే బాల్య వివాహాలు జరుగుతున్న వేళ 21 ఏండ్ల వరకు అమ్మాయిల వివాహాలను జరుగకుండా చూడడం పెద్ద సవాళుగా నిలుస్తుందని హెచ్చరిస్తున్నారు. అమ్మాయిల భద్రత, మానభంగాలు, లైంగిక వేధింపుల నేపథ్యంలో గ్రామీణ తల్లితండ్రులు తమ కూతుర్ల వివాహాలను తొందరగా చేసే చేతులు దులుపు కోవడానికే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 ఏళ్ళకే ఓటు హక్కు కల్పించిన ప్రభుత్వం పురుషుల వివాహ వయస్సును కూడా 18 ఏండ్లకు తగ్గించాలని వాధిస్తున్న సంఘాలు/వ్యక్తులు కూడా ఉన్నారు.

పురుషుల వివాహ వయస్సు 22-24 వరకు పెంచలేమా..?

భారత సమాజపు వివాహ జంటల్లోఅమ్మాయిల వయస్సు కన్న అబ్బాయిల వయస్సు కనీసం 1-2 ఏండ్లు ఎక్కువగా ఉండేలా చూడడం ఒక నియమం అయ్యింది. నేడు అమ్మాయిల కనీస వివాహ వయస్సు 21 ఏండ్లకు పెంచడంతో పాటు అబ్బాయిల వివాహ వయస్సు 22-24 వరకు పెంచాలనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. పురుషులకు, మహిళలకు కనీస వివాహ వయస్సు 22-23 వరకు పెంచాలని వాధించే పౌరసమాజం కూడా ఉన్నది.

21 ఏళ్ళ నాటికి మహిళలు కనీసం డిగ్రీ వరకు ఉన్నత విద్యను పూర్తి చేస్తారని, దీనితో అమ్మాయిల వివాహానికి పూర్వమే వారికి మానసిక వికాసం కలుగుతుందనే వాదన వాస్తవంగా తోస్తున్నది. 18 ఏండ్లకే అమ్మాయిలకు వివాహం చేయడంతో వారి విద్య ఇంటర్‌తోనే ఆగిపోతుందని గుర్తించాలి. నేటి ఆధునిక సమాజంలో మహిళల పట్ల వివక్షను రూపుమాపి, మహిళా విద్యను పెంచి, సాధికారత సాధించి, లింగ సమానత్వాన్ని సాకారం చేయుటలో నేటి 21 ఏండ్ల కనీస అమ్మాయిల వివాహ వయస్సు పెంచాలనే ప్రభుత్వ నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇవ్వాలని కోరుకుందాం. అమ్మాయిలను లక్ష్మి, సరస్వతి, దుర్గలుగా ఆరాదిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ కసరత్తు.. జనవరిలో షెడ్యూల్ ఉంటుందా?

ఉత్తరప్రదేశ్, డిసెంబర్ 18:ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సీఈసీ రెడీ అవుతోంది. యూపీతో పాటు దేశంలోని మరో 4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈసీ ఎన్నికలకు అన్ని సన్నాహాలు ప్రారంభించింది. జనవరి మొదటి వారంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటన వెలువడనున్నట్టు తెలుస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలు అత్యంత కీలకమైనవిగా భావిస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్ని రాజకీయ పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. యూపీతో పాటు పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలను జనవరి 5 తర్వాత ఎప్పుడైనా ప్రకటించవచ్చని తెలుస్తోంది. జనవరి మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చని, లేకుంటే వచ్చే వారం ఈసీ బృందం.. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పర్యటించిన తర్వాత ఎన్నికల ప్రకటన వెలువడే చాన్స్ ఉండొచ్చని తెలుస్తోంది.

ఉత్తర ప్రదేశ్‌లో ఏడు దశల్లో ఎన్నికలు?

యూపీలో ఏడు దశల్లో ఎన్నికలు జరుగునున్నట్టు సమాచారం. ఈసీ కూడా దీని ఆధారంగా ఎన్నికలకు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. దేశంలోనే పెద్ద స్టేట్ కావడంతో ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని ఈసీ (ఎలక్షన్ కమిషన్) భావిస్తోంది. అదే సమయంలో, 2017లోనూ రాష్ట్రంలో ఏడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల తర్వాత బీజేపీ ప్రభుత్వం ఏర్పడగా మిత్రపక్షాలతో కలిపి 325 సీట్లు సాధించి అధికారం దక్కించుకుంది.

సవాలు విసురుతున్న కొత్త వేరియంట్లు.. బ్రేక్ త్రూ ఇన్‌ఫెక్షన్లతో మరింత ఇమ్యూనిటీకి..

హైదరాబాద్, డిసెంబర్ 18:కరోనా కొత్త వేరియంట్లు శాస్త్రవేత్తలకు సవాలు విసురుతున్నాయి. వ్యాక్సిన్ వేసుకున్న వారు కూడా కొత్త వేరియంట్‌ల బారిన పడటం (బ్రేక్ త్రూ ఇన్‌ఫెక్షన్లు) ఆందోళన కలిగిస్తోందంటున్నారు సైంటిస్టులు. అయితే బ్రేక్ త్రూ (ఎతీవజీన్ బిష్టతీనీబీణష్ట) ఇన్‌ఫెక్షన్ల బారిన పడడం వల్ల భవిష్యత్‌లో రాబోయే వేరియంట్లను ఎదుర్కొనే విధంగా శరీరంలోని రోగనిరోధక ప్రతిస్పందనలు వృద్ధి చెందుతాయని పరిశోధనలో వెల్లడైందంటున్నారు. డెల్టా వేరియంట్‌పై నిర్వహించిన ఈ పరిశోధన జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఎంఓం)లో ప్రచురితమైంది.

వ్యాక్సిన్ తీసుకున్నాక కరోనా బారిన పడినప్పుడు వ్యాధి నిరోధక ప్రతి స్పందన వేగంగా వృద్ధి చెంది, సార్స్‌కోవ్-2 ఇతర మ్యుటేషన్లను సైతం ఎదుర్కొనే సామర్థ్యం వస్తుందని అమెరికాకు చెందిన ఒరిజాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పికాడు టఫెస్సే, మరో పరిశోధకుడు మార్కెల్ కర్లిన్‌లు తెలిపారు. వ్యాక్సిన్లు తీసుకున్నాక కరోనా బారిన పడిన వారి నుండి తీసుకున్న రక్తనమూనాలను పరిశీలించినప్పుడు మెరుగైన రోగనిరోధక ప్రతిస్పందనలను గుర్తించినట్లు తెలిపారు.

అధ్యయనంలో భాగంగా మొత్తం 52 మంది నుండి రక్తనమూనాలను సేకరించామని అన్నారు. బ్రేక్ త్రూ ఇన్‌ఫెక్షన్ల వల్ల యాంటీబాడీలు మరిన్ని ఎక్కువ విడుదల అవుతాయని ఈ పరిశోధనలో తేలిందని అన్నారు. దీర్ఘకాలంలో కరోనా ఎపిడమిక్ (అంటువ్యాధి)గా మారడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వైరస్ ను అంతం చేయాలంటే వ్యాక్సిన్ ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ఒకసారి వ్యాక్సిన్ వేసుకుంటే వైరస్ నుంచి రక్షణ పొందినట్లేనని కర్లిన్ తెలిపారు. అయితే ప్రత్యేకించి ఒమిక్రాన్ వేరియంట్‌పై అధ్యయనం చేపట్టలేదని అన్నారు.

మూడు డోసులు తీసుకున్నా.. పనిచేయలేదట..

హైదరాబాద్, డిసెంబర్ 18:మూడు డోసుల వ్యాక్సిన్ తీసుకున్నా కూడా ఒమిక్రాన్ వైరస్ అటాక్ చేసిందని అంటున్నారు మహారాష్ట్ర వాసి ఒకరు. న్యూయార్క్ నుంచి ఈ నెల 9న వచ్చిన 29 ఏళ్ల వ్యక్తికి పరీక్షలు నిర్వహించగా.. కరోనా పాజిటివ్‌గా తేలినట్లు బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) తెలిపింది. అనంతరం జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపగా ఒమిక్రాన్ సోకినట్లు తేలిందని పేర్కొంది. కాగా, ఆ వ్యక్తికి ఎటువంటి లక్షణాలు కనిపించలేదని, అతడు ఇప్పటికే ఫైజర్ మూడు డోసులు తీసుకున్నట్లు పేర్కొంది.

అతనితో సన్నిహితంగా ఉన్న ఇద్దరు వ్యక్తులకు పరీక్షలు చేపట్టగా.. నెగిటివ్ అని తేలినట్లు బీఎంసీ వెల్లడించింది. జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని హాస్పిటల్‌లో చేర్చినట్లు తెలిపారు అధికారులు. దీంతో వాణిజ్య రాజధానిలో ఇప్పటి వరకు ఒమిక్రాన్ కేసులు 15కు చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40కి పెరిగాయి.

తెల్లజుట్టుతో పెళ్ళిపీటలెక్కిన బాలీవుడ్ నటుడి కుమార్తె : కొనియాడిన నెటిజన్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ఇప్పుడంతా ఫ్యాషన్ ప్రపంచం. ఫాష్ గా కనిపించేందుకు ఎంతో ఉబలాటపడుతుంటారు జనాలు. నేటి కాలంలో వృద్ధాప్ఛాయలు, తెల్ల జుట్టు త్వరగానే వచ్చేస్తున్నాయి. దాంతో నేటి యువత ఎంతో కుంగిపోతుంది. అయితే జుట్టు తెల్లబడినంతమాత్రాన జీవితం ముగియలేదని నిరూపించిందో మహిళ. జుట్టు తెల్లబడితే తప్పేంటి అంటూ పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమయింది. వివరాల్లోకి వెళ్తే ..

బాలీవుడ్ సీనియర్ నటుడు దిలీప్‌జోషి కుమార్తె నియతికి ఇటీవలే పెళ్లైంది. తన ముద్దుల కుమార్తె ఫొటోలను దిలీప్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. తెల్ల జుట్టుతో పెళ్లి పీటలు ఎక్కి అందరిని ఆశ్చర్యపరిచిన నియతి.ఆత్మవిశ్వాసానికి మించిన అందం లేదని నిరూపించిందామె. దాంతో సోషల్ మీడియాలో నియతికి అభినందనలు వెళ్లువెత్తుతున్నాయి. జుట్టు తెల్లబడితే అదేం నేరం కాదని చెబుతోంది నియతి. కాగా ఆమె ధైర్యానికి హాట్సాఫ్ చెబుతున్నారు నెటిజన్లు. ఈమె పలువురికి ఆదర్శప్రాయమని కొనియాడుతున్నారు.

నేడు గోవాను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిసెంబర్ 19 న గోవా ను సందర్శించి, మధ్యాహ్నం పూట 3 గంటల వేళ కు గోవా లోని డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్టేడియమ్ లో గోవా విమోచన దినోత్సవాల సంబంధిత కార్యక్రమాని కి హాజరు అవుతారు. ఆ కార్యక్రమం లో ప్రధాన మంత్రి స్వాతంత్ర్య యోధుల ను, 'ఆపరేషన్ విజయ్' లో పాల్గొన్న యోధుల ను సమ్మానించనున్నారు. పోర్చుగీసు పాలన నుంచి గోవా కు విముక్తి ని ఇచ్చేందుకు భారతదేశ సాయుధ దళాలు చేపట్టిన 'ఆపరేషన్ విజయ్' సఫలత కు గుర్తు గా ప్రతి సంవత్సరం లో డిసెంబర్ 19వ తేదీ నాడు ఒక వేడుక గా గోవా విమోచన దినాన్ని నిర్వహించడం జరుగుతున్నది.

సరికొత్త మెరుగుల ను దిద్దిన అటువంటి ఫోర్ట్ అగువాడా జైల్ మ్యూజియమ్ గోవా మెడికల్ కాలేజీ లో నిర్మించిన సూపర్ స్పెశాలిటీ బ్లాక్, న్యూ సౌథ్ గోవా డిస్ట్రిక్ట్ హాస్పిటల్, మోపా విమానాశ్రయం లో నెలకొల్పిన ఏవియేశన్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్, ఇంకా మార్ గావ్ లోని దబోలిమ్-నావెలిమ్ లో ఏర్పాటు చేసినటువంటి గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేశన్ లతో సహా అనేక అభివృద్ధి పథకాల ను ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. గోవా లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఏర్పాటు చేసే ఇండియా ఇంటర్ నేశనల్ యూనివర్సిటి ఆఫ్ లీగల్ ఎడ్యుకేశన్ ఎండ్ రిసర్చ్ కు ఆయన శంకుస్థాపన చేస్తారు.

దేశం అంతటా చికిత్స సదుపాయాల ను సమకూర్చడం కోసం, చికిత్స సంబంధి మౌలిక సదుపాయాల ను మెరుగు పరచడం కోసం ప్రధాన మంత్రి నిరంతరం పాటుపడుతుండగా, ఈ దృష్టి కోణాని కి తగినట్లు గా గోవా లో గోవా మెడికల్ కాలేజీ ఎండ్ హాస్పిటల్ లో ఒక సూపర్ స్పెశాలిటీ బ్లాకు ను ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన లో భాగం గా 380 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు తో నిర్మించడం జరిగింది. గోవా రాష్ట్రం అంతటి లో అత్యధునాతన సూపర్ స్పెశాలిటీ హాస్పిటల్ ఇది ఒక్కటే. ఈ ఆసుపత్రి యాంజియో ప్లాస్టింగ్, బైపాస్ సర్జరీ, కాలేయం మార్పిడి, మూత్రపిండం మార్పిడి, డాయలిసిస్ తదితర విశిష్ట సేవల ను అందించనుంది. ఈ సూపర్ స్పెశాలిటీ బ్లాకు లో 1000 ఎల్ పిఎమ్ సామర్థ్యం కలిగిన పిఎస్ఎ ప్లాంటు ను కూడా పిఎమ్-కేర్స్ లో భాగం గా స్థాపించడమైంది.

దాదాపు 220 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మించిన న్యూ సౌథ్ గోవా డిస్ట్రిక్ట్ హాస్పిటల్ లో 33 స్పెశాలిటీ లలో ఒపిడి సేవల కు తోడు గా ఆధునిక రోగ నిర్ధారణ సదుపాయాలు, ఇంకా ప్రయోగశాల సదుపాయాలు, ఇంకా ఫిజియోథెరపి, ఆడియోమెట్రి ల వంటి సేవలు సహా నవీన చికిత్స సంబంధి మౌలిక సదుపాయాల హంగుల ను ఏర్పాటు చేయడమైంది. ఈ ఆసుపత్రి లో 500 ప్రాణవాయు సరఫరా సహిత పడక లు, 5500 లీటర్ సామర్థ్యం కలిగిన ఎల్ఎమ్ఒ ట్యాంకు, ఇంకా 600 ఎల్ పిఎమ్ సామర్థ్యం కలిగిన 2 పిఎస్ఎ ప్లాంటు లు ఉన్నాయి.

స్వదేశ్ దర్శన్ స్కీమ్ లో భాగం గా ఒక వారసత్వ పర్యటన సంబంధి గమ్య స్థానం గా అగువాడా ఫోర్ట్ జైల్ మ్యూజియమ్ ను 28 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు తో తీర్చిదిద్దడం జరిగింది. గోవా విముక్తి కి పూర్వపు కాలం లో అగువాడా ఫోర్టు ను స్వాతంత్ర్య యోధుల ను ఖైదు చేయడం కోసం, వారి ని చిత్రహింస పెట్టడం కోసం ఉపయోగించారు. గోవా విమోచనం కోసం పోరాటం సలిపిన ప్రముఖ స్వాతంత్ర్య యోధులు అందించిన తోడ్పాటుల ను, వారు చేసిన త్యాగాల ను ప్రముఖం గా కళ్ళకు కట్టడం తో పాటు వారికి ఈ మ్యూజియమ్ ఒక సముచితమైన నివాళి కాగలదు.

త్వరలో నిర్మాణం పూర్తి కానున్న మోపా విమానాశ్రయం లో ఏవియేశన్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటరు ను సుమారు 8.5 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మించడం జరిగింది. 16 వేరు వేరు ఉద్యోగ విధుల కు సంబంధించిన శిక్షణ ను ఈ సెంటర్ లో ఇప్పించడం జరుగుతుంది. మోపా విమానాశ్రయం ప్రాజెక్టు పని చేయడం ప్రారంభం అయిన తరువాత శిక్షణార్థులు ఆ విమానాశ్రయం లోను, అలాగే భారతదేశం లోని, ఇంకా విదేశాల లోని ఇతర విమానాశ్రయాల లో సైతం ఉద్యోగ అవకాశాల ను చేజిక్కించుకోగలుతారు.

మార్ గావ్ లోని దావోర్ లిమ్-నావెలిమ్ లో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేశన్ నిర్మాణాని కి దాదాపు గా 16 కోట్ల రూపాయల ను వెచ్చించడం జరిగింది. భారత ప్రభుత్వ విద్యుత్తు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని ఇంటిగ్రేటెడ్ పవర్ డెవెలప్ మెంట్ స్కీమ్ లో భాగం గా ఈ సబ్ స్టేశన్ నిర్మాణం జరిగింది. ఇది దావోర్ లిమ్, నెస్సాయి, నావెలిమ్, అక్వెమ్-బాయిక్సో, ఇంకా తేలావులిమ్ గ్రామాల కు విద్యుత్తు సరఫరా ను సమకూర్చనుంది.

గోవా ను ఉన్నత విద్య కేంద్రంగాను, సాంకేతిక విద్య కేంద్రం గాను పరివర్తన చెందించాలన్న ప్రభుత్వ శ్రద్ధ కు అనుగుణం గా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు కు చెందిన ఇండియా ఇంటర్ నేశనల్ యూనివర్సిటి ఆఫ్ లీగల్ ఎడ్యుకేశన్ ఎండ్ రిసర్చ్ ను ఏర్పాటు చేయడం జరుగుతోంది.

పోర్చుగీసు పాలన నుంచి గోవా ను విముక్తం చేయడం లో భారతదేశ సాయుధ దళాలు పోషించిన పాత్ర ను స్మరించుకోవడాని కి గుర్తు గా రూపొందించిన ఒక స్పెశల్ కవర్, ఇంకా స్పెశల్ కాన్సిలేశన్ ను కూడా ప్రధాన మంత్రి ఆవిష్కరించనున్నారు. ఈ చారిత్రిక విశిష్ట ఘట్టాన్ని స్పెశల్ కవర్ పైన ముద్రించడం జరిగింది. మరో పక్క స్పెశల్ కాన్సిలేశన్ అనేది భారతదేశ నౌకా దళాని కి చెందిన గోమంతక్ అనే ఓడ పైన రూపొందించిన యుద్ధ స్మారకాన్ని గురించి చాటుతుంది. "ఆపరేశన్ విజయ్" లో ప్రాణ సమర్పణం చేసిన ఏడుగురు యువ సాహసిక నావికులు, తదితర సిబ్బంది స్మారకార్థం దీనిని నిర్మించడమైంది. ప్రధాన మంత్రి పాత్రదేవి లోని హుతాత్మ స్మారక్ ను కళ్ళకు కట్టే 'మై స్టాంప్' ను కూడా విడుదల చేస్తారు. ఇది గోవా విమోచన ఉద్యమం లోని అమరవీరుల విశిష్ట త్యాగాల కు నమస్సులు అర్పిస్తుంది. గోవా విమోచన పోరాట కాలం లో వివిధ ఘట్టాల ను అభివర్ణించే ఒక దృశ్య మాలిక తో కూడిన 'మేఘ్ దూత్ పోస్ట్ కార్డు' ను ఈ సందర్భం లో ప్రధాన మంత్రి కి బహూకరించడం జరుగుతుంది.

ఉత్తమ పంచాయతీ/ఉత్తమ పురపాలక సంఘం, స్వయంపూర్ణ మిత్ర లు మరియు స్వయంపూర్ణ గోవా కార్యక్రమం లబ్ధిదారుల కు పురస్కారాల ను కూడా ప్రధాన మంత్రి ప్రదానం చేయనున్నారు.

ప్రధాన మంత్రి తన సందర్శన లో భాగం గా, మధ్యాహ్నం పూట 2గంటల 15 నిమిషాల కు పణజి లోని ఆజాద్ మైదానం లో అమరవీరుల స్మారకం వద్ద పుష్పాంజలి ని కూడా సమర్పించనున్నారు. ఆయన 2గంటల 30 నిమిషాల వేళ కు పణజి లోని మీరామర్ లో జరిగే సెయిల్ పరేడ్ ఎండ్ ఫ్లయ్ పాస్ట్ కు హాజరు అవుతారు.

జిల్లాలో పెరిగిన చలి తీవ్రత.. పశ్చిమ ప్రాంత నుంచి వీస్తున్న చలిగాలులు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: జిల్లాలో గత రెండురోజులుగా చలి పణికిస్తుంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతుండటంతో చలి తీవ్రత పెరుగుతుంది. ఈ క్రమంలో చలిపట్ల అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరిస్తుంది. ఉదయం 9 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. ముఖ్యంగా జిల్లాలోని మండల, పల్లే ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో తూర్పు, ఈశన్య గాలులు వీస్తుండటంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతవరణ కేంద్రం తెలిపింది. ఈనెల 18 నుంచి 20వ తేది వరకు రాత్రి ఉష్ణోగ్రతలు 8 డిగ్రీలు 15 డిగ్రీలు నమోదు కావచ్చని వాతవరణ శాఖ తెలిపింది. రాత్రి నుంచి చలిగాలులు మరింత బలంగా వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ చలిగాలుల ప్రభావం ఫిబ్రవరి మొదటి వారం వరకు ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మొత్తంగా గత రెండురోజులుగా జిల్లాలో చలి తీవ్రత అధికం కావడంతో సాయంత్రం కాగానే రోడ్లన్ని నిర్మానుషంగా మారుతున్నాయి. చలి అధికంగా కావడంతో వాటిని తట్టుకునేందుకు స్వెటర్లు, మఫ్లర్లు, బట్టల దుఖాణాలను ప్రత్యేకంగా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. చలి నివారణ దుస్తులు రూ.300 నుంచి రూ.900 వరకు ధర నాణ్యతను బట్టి అమ్మకాలు చేస్తున్నారు. మహిళలకు ప్రత్యేక దుస్తులు విక్రయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో అధికంగా మంచుపోగ కమ్ముకుంటుండటంతో మబ్బులు ఏర్పడుతున్నాయి. చలి తీవ్రతతో సాయంత్రం 7 గంటలు కాగానే ఇళ్లకు చేరిపోతున్నారు.

ఒమ్రికాన్ బుగులు

చలి తీవ్రత కారణంగా కరోనా వైరస్ బుగులు ప్రజల్లో మరింత రెట్టింపయింది. వైరస్ తగ్గినట్టే అనిపిస్తున్న తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు సోకిన వారు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు కోరుతున్నారు. ఈ సమయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సామాజిక దూరం పాటించాలని, ఇలాంటి వాతవరణంలో సీజనల్ వ్యాధులు అధికంగా సోకే ప్రమాదం పొంచి ఉందని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా చలికాలంలో దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి లక్షణాలు ఎక్కువగానే ఉంటాయి. ఈ పరిస్థితిల్లోనే ఏది కరోనా, సాధారణ జ్వరం, జలుబు దగ్గు తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి.

ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే కేపీ

రంగారెడ్డి, డిసెంబర్ 18:ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం 125 డివిజన్ పరిధిలోని షిర్డీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈరోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన తమ కాలనీలో భూగర్భడ్రైనేజీ, మంచి నీటి పైపు లైన్లు, సీసీ రోడ్లు, పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ? వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మోహన్ రావు, జెనరల్ సెక్రెటరీ యశస్వి, వైస్ ప్రెసిడెంట్ వీరన్న, ట్రెజరర్ వేణు గోపాల్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ఇందిర పరిమి రచించిన బుక్ ని రిలీజ్ చేసిన సీఎం జగన్

ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కు ఎమ్మెల్యేల పరామర్శ

నల్లగొండ, డిసెంబర్ 18:: తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తండ్రి గాదరి మరయ్య పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. కిషోర్ కుటుంబానికి ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, జడ్పీ చైర్లన్లు బండా నరేందర్ రెడ్డి, గుజ్జ దీపికా, మాజీ ఎమ్మెల్యేలు కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, వేముల వీరేశం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తండ్రి మారయ్య (73) శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. నల్లగొండ మండలం నర్సింగ్‌భట్లకు చెందిన గాదరి మారయ్య పీఈటీగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సేవలందించారు. నల్లగొండ పట్టణంలో కుటుంబంతో కలిసి శేషజీవితం గడుపుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా మారయ్య మరణించారు.

అంతర్జాతీయస్థాయిలో ఆయుర్వేద ఔషధాలకు ప్రోత్సాహం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ఇటీవల ఆయుష్ రంగంపై భారతీయ సంప్రదాయ వైద్య (ఎఫ్ఐటిఎం) వేదిక ఒక నివేదికను ప్రచురించింది. దీనిని అభివృద్ధి చెందిన దేశాలకు పరిశోధన అభివృద్ధి వ్యవస్థ (ఆర్ఐఎస్) కింద ప్రచురించారు. ఇది న్యూఢిల్లీలో గల స్వతంత్ర ప్రతిపత్తిగల విధాన పరిశోధన సంస్థ. ఈ నివేదిక ప్రకారం,ఆయుష్ పరిశ్రమ టర్నోవర్ 18.1 బిలియన్ అమెరికన్ డాలర్లు. దీని మార్కెట్ సైజు మొత్తంగా 2014-20లలో 17 శాతం పెరిగింది. ఆయుష్, హెర్బల్ వైద్యానికి సంబంధించి మొత్తం ఎగుమతులు 2014లో 1.09 బిలియన్ అమెరికన్ డాలర్లు ఉండగా 2020 నాటికి అది 1.54 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఏటా ఇది 5.9 శాతం అభివృద్ధిని సాధించింది.

భారత ప్రభుత్వానికి చెందిన ఆయుష్ మంత్రిత్వశాఖ ఆయుష్ రంగంలో అంతర్జాతీయ సహకారానికి ఒక కేంద్ర పథకాన్ని రూపొందించింది. దీని ప్రకారం ఆయుష్ వ్యవస్థ ఔషధాలను అంతర్జాతీయంగా ప్రోత్సహించడం, వాటిపై అవగాహన ను బలోపేతంచేయడం దీని ఉద్దేశం. అంతర్జాతీయంగా ఆయుష్ ఔషధాల ప్రోత్సాహం, ఆయుష్ వ్యవస్థ ఔషధాలకు గుర్తింపు, స్టేక్ హోల్డర్లతో సంబంధాలు కొనసాగింపు, ఆయుష్ ఔషధాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ అభివృద్ధి, ఆయుష్ ఉత్పత్తులు, సేవలు, విద్య , పరిశోధన, శిక్షణను అంతర్జాతీయంగా నిర్వహించడం ఆయుష్ అకడమిక్ ఛైర్ లను విదేశాలలో ఏర్పాటు ద్వారా అకడమిక్ పరిశోధనను ముందుకు తీసుకువెళ్లడం, విదేశాలలో ఆయుష్ సమాచార వ్యవస్థల ఏరర్పాటు, విదేశీ ప్రజలకు ఆయుష్ వ్యవస్థలకు సంబంధించి అధీకృత సమాచారం అందించడం వంటివి ఇందులో ఉన్నాయి.

ఆయుష్ లో అంతర్జాతీయ సహకార పథకం (ఐసి పథకం) లో భాగంగా ఆయుష్ ఫెలోషిప్ పథకం కింద ప్రతి సంవత్సరం 101 దేశాలనుంచి భారత్‌లోని ప్రముఖ సంస్థలలో ఆయుష్‌కోర్సులు చదువుతున్న అర్హులైన విదేశీ విద్యార్థులకు 104 స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం జరుగుతుంది.

ఆయుష్ మంత్రిత్వశాఖ విదేశీ విశ్వవిద్యాలయాలలో , సంస్థలలో ఆయుష్ అకడమిక్ ఛైర్ లు ఏర్పాటు చేసేందుకు 14 అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంఇ. ఇందుకు ఆయుష్ నిపుణులను బోధన, శిక్షణ, పరిశోధన కార్యకలాపాలు చేపట్టేందుకు పంపడం జరుగుతుంది. వివిధ బహుళ పక్ష వేదికలైన జి-20, బిమ్‌స్టెక్, బ్రిక్స్, ఐబిఎస్ ఎ, ఎస్సిఒ తదితరాలను సమర్థంగా ఉపయోగించుకుని ఆయుర్వేద, ఆయుష్ వ్యవస్థలకు అంతర్జాతీయ గుర్తింపు పొందేందుకు ప్రయత్నించడం జరుగుతుంది.

ఆయుష్ మంత్రిత్వశాఖ లండన్ స్కూల్ ఆఫ్ హైజిన్, ట్రాపికల్ మెడిసిన్ (ఎల్ ఎస్ హెచ్ అండ్ టిఎం) బ్రిటన్ తో ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. బ్రిటన్ లో కోవిడ్ -19 నుంచి కోలుకునేందుకు అశ్వగంధ ను ప్రమోట్ చేయడంపై అధ్యయనం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు.

కోవిడ్ 19 ఇన్ ఫెక్షన్‌ను ఎదుర్కోనేందుకు ఇన్ విట్రో, ఇన్ వివో అధ్యయనం కింద పరస్పర సహకారంతో గుడుచ్యాది టాబ్లెట్లపై పరిశోధన సాగించేందుకు జర్మనీ లోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు చెందిన ఫ్రాంక్‌ఫర్టర్ ఇన్నోవేషన్ జెంత్రం బయోటెక్నాలజీ జిఎంబిహెచ్ (ఎఫ్ఐజెడ్) తో అయుష్ మంత్రిత్వశాఖ ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.

పాదయాత్ర ప్రారంభించిన రేవంత్ రెడ్డి : పాల్గొన్న దిగ్విజయ్ సింగ్

రంగారెడ్డి, డిసెంబర్ 18:రంగారెడ్డి జిల్లా ముడిమ్యాల నుంచి చేవెళ్లలోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు పది కిలోమీటర్ల మేర టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్రని చేపట్టారు. నిత్యావసర వస్తువుల ధరలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఈ పాదయాత్రను చేపట్టింది. నిత్యావసర ధరలు తగ్గేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కాగా ఈ పాదయాత్రను ముడిమ్యాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ పాదయాత్రలో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ కూడా పాల్గొనడం విశేషం. పాదయాత్ర ముగిసిన తర్వాత బహిరంగసభలో రేవంత్, దిగ్విజయ్ సింగ్ ప్రసంగించనున్నారు. ఈ పాదయాత్రని దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టింది.

తెలంగాణ బిజేపీ నేతలకు అమిత్‌షా ఆఫీసు నుంచి పిలుపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆఫీసు నుంచి తెలంగాణ బీజేపీ నేతలకు పిలుపు వచ్చింది. ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి ఢిల్లీకి రావాలన్నపిలుపుతో వచ్చే మంగళవారం హోంమంత్రి కార్యాలయంలో అమిత్ షాతో భేటీ కానున్నారు. ఈ భేటీలో హుజూరాబాద్ గెలుపు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్టు తెలుస్తోంది.

అలాగే, పార్టీలోని ముఖ్య నాయకుల బాధ్యతలపై దిశానిర్దేశం చేసే చాన్స్ కనిపిస్తోంది. ఇదిలా ఉంటే తెలంగాణలో టీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ వార్ నడుస్తున్న నేపథ్యంలో ఈ భేటీకి మరింత ఇంపార్టెన్స్ ఉన్నట్టు తెలుస్తోంది.

ఆల్ ఇండియా మేయర్స్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:ఆల్ ఇండియా మేయర్స్ కాన్ఫరెన్స్ ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ తో పాటు, కేంద్ర మంత్రి శ్రీ హర్ దీప్ సింహ్ పురి ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్నారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ప్రాచీన నగరం అయిన వారాణసీ లో ఇటీవలి పరిణామాల ను గురించి ప్రస్తావించారు. కాశీ అభివృద్ధి యావత్తు దేశాని కి ఒక మార్గ సూచీ కాగలదు అంటూ తాను చేసిన ప్రకటన ను ఆయన గుర్తు కు తెచ్చుకొన్నారు. మన దేశం లో చాలా వరకు నగరాలు సాంప్రదాయక నగరాలు. అవి ఒక సంప్రదాయ పద్ధతి లో అభివృద్ధి జరిగిన నగరాలు అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ ఆధునికీకరణ యుగం లో ఈ నగరాల ప్రాచీనత కూడా అంతే ప్రాముఖ్యాన్ని కలిగి ఉంది అని ఆయన పేర్కొన్నారు. ఈ నగరాలు వారసత్వాన్ని, స్థానిక నైపుణ్యాల ను ఏ విధం గా పరిరక్షించుకోవాలో మనకు బోధించ గలుగుతాయి అని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఉన్న నిర్మాణాల ను నాశనం చేయడం ఒక మార్గం కాదు కానీ పరిరక్షణ, ఇంకా కొత్త బలాన్ని ఇచ్చే అంశాల పైన శ్రద్ధ వహించాలి అని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. ఆధునిక కాలాల అవసరాల ప్రకారం ఇది జరగాలి అని ఆయన అన్నారు.

స్వచ్ఛత కోసం నగరాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ అవసరం అని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. స్వచ్ఛత ను సాధించడం కోసం శ్రేష్ఠ ప్రయాసల కు నడుంకడుతున్న నగరాల తో పాటు గా ఉత్తమ ప్రదర్శన ను నమోదు చేస్తున్న నగరాల ను గుర్తించడం కోసం కొత్త కేటగిరీల ను ఏర్పరచ గలమా ! అంటూ ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. స్వచ్ఛత కు తోడు గా నగరాల సుందరీకరణ గురించి సైతం ఆయన పట్టుబట్టారు. ఈ విషయం లో మేయర్ లు వారి వారి నగరాల లోని వార్డు ల మధ్య ఆరోగ్యకరమైన స్పర్ధ తాలూకు భావన ను రేకెత్తింప చేయాలి అని ఆయన కోరారు.

ప్రధాన మంత్రి తన 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమం లో ఇచ్చిన ఉపన్యాసాల లో పదే పదే ప్రస్తావిస్తూ వస్తున్నటువంటి స్వాతంత్ర్య సమరం ఇతివృత్తం గా సాగే ముగ్గు ల పోటీ లు, పాట ల పోటీ లు, లాలి పాట పోటీ ల వంటి 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కు సంబంధించిన కార్యక్రమాల ను కూడా నిర్వహించవలసింది గా మేయర్ లకు ఆయన సూచించారు. నగరాల జన్మ దినాల ను మేయర్ లు కనుగొని, వాటిని వేడుక గా నిర్వహించాలి అని కూడా మంత్రి సలహా ఇచ్చారు. నదులు ఉన్నటువంటి నగరాల లో నదీ ఉత్సవం జరపాలన్నారు. నదుల కీర్తి ని వ్యాప్తి చేయవలసిన అవసరం ఉంది. అలా చేస్తే ప్రజలు ఆయా నదుల పట్ల గర్వపడి మరి వాటి ని స్వచ్ఛం గా ఉంచుతారు అని ఆయన అన్నారు. "నదుల ను నగర జీవనాని కి కేంద్ర స్థానం లోకి తిరిగి తీసుకు రావాలి. ఇది మీ నగరాల కు ఒక కొత్త ప్రాణ శక్తి ని ప్రసాదిస్తుంది" అని మంత్రి అన్నారు. ఒకసారి వాడిన ప్లాస్టిక్ ను ఆ తరువాత నిర్మూలించడాని కి సంబంధించిన ప్రచార ఉద్యమాని కి నూతన చైతన్యాన్ని ఇవ్వండి అంటూ మేయర్ లకు ఆయన విజ్ఞప్తి చేశారు. వ్యర్థ: నుంచి సంపద ను సృష్టించే మార్గాల కోసం వెతకండి అని మేయర్ లకు ఆయన చెప్పారు. "మన నగరం స్వచ్ఛం గా, అదే జోరు లో ఆరోగ్యం గా కూడాను ఉండాలి, మన ప్రయాస కు ఇది కీలకం కావాలి" అని ఆయన అన్నారు.

మేయర్ లు వారి నగరాల లోని ఇళ్ళ లో, వీధుల లో ఎల్ఇడి బల్బుల ను విరివి గా వాడుక లోకి తీసుకు వచ్చేటట్లు చూడాలి అని ఆయన కోరారు. దీని ని ఒక ఉద్యమం తరహా లో చేపట్టండి అంటూ వారికి ఆయన సూచించారు. ఇప్పటికే అమలులో ఉన్నటువంటి పథకాల ను కొత్త కొత్త ఉపయోగాల కోసం వాడుకొనేటట్లు గాను, ఆయా పథకాల ను ముందుకు తీసుకు పోయేటట్లు గాను మనం ఎల్లప్పుడూ ఆలోచన లు చేస్తూ ఉండాలి అని ఆయన అన్నారు. నగరం లోని ఎన్ సిసి విభాగాల ను సంప్రదించి, నగరాల లోని విగ్రహాల ను శుభ్రపరచడం కోసం బృందాల ను ఏర్పాటు చేయాలని, 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' స్ఫూర్తి తో మహనీయుల కు సంబంధించిన ఉపన్యాస కార్యక్రమాల ను ఏర్పాటు చేయాలని ఆయన మేయర్ ల కు సలహా ను ఇచ్చారు. అదే విధం గా, మేయర్ లు వారి నగరం లో ఒక ప్రదేశాన్ని గుర్తించి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను జ్ఞప్తి కి తెచ్చేటటువంటి ఒక కట్టడాన్ని పిపిపి పద్ధతి లో నిర్మించాలి అని ఆయన అన్నారు. 'ఒక జిల్లా, ఒక ఉత్పత్తి' కార్యక్రమాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, మేయర్ లు వారి నగరాల యొక్క విశిష్టమైన గుర్తింపు ప్రస్ఫుటం అయ్యేలా ఏదైనా ఒక ప్రత్యేకమైనటువంటి ఉత్పాదన లేదా నగరం లోని ప్రదేశం వంటి వాటిని ప్రచారం లోకి తీసుకు రావడానికి యత్నించాలి అని ప్రధాన మంత్రి అన్నారు. పట్టణ జీవనం తాలూకు వేరు వేరు అంశాల కు సంబంధించి ప్రజానుకూల ఆలోచనల ను అభివృద్ధి పరచవలసింది గా వారిని ప్రధాన మంత్రి కోరారు. సార్వజనిక రవాణా వినియోగాన్ని మనం ప్రోత్సహించవలసిన అవసరం ఉంది అని ఆయన అన్నారు. మేయర్ లు వారి నగరం లో ప్రతి ఒక్క సదుపాయాన్ని 'సుగమ్య భారత అభియాన్' లో భాగం గా దివ్యాంగుల కు అనుకూలమైనవి గా మలచేందుకు శ్రద్ధ తీసుకోవాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు.

"మన నగరాలు మన ఆర్థిక వ్యవస్థ కు చోదక శక్తి గా ఉన్నాయి. మనం ఒక చైతన్యభరితమైనటువంటి ఆర్థిక వ్యవస్థ కు నిలయం గా నగరాన్ని తీర్చిదిద్దాలి" అని ఆయన అన్నారు. ఆర్థిక కార్యకలాపాల కు ఆహ్వానం పలికే మరియు అటువంటి కార్యకలాపాల ను ప్రోత్సహించే ఒక ఇకోసిస్టమ్ ను నిర్మించడం కోసం అన్ని సదుపాయాల ను ఏక కాలం లో అభివృద్ధి పరుస్తూ ఒక సంపూర్ణమైన వ్యవస్థ ను ఆవిష్కరించండి అని వారి కి ఆయన సూచించారు.

మన అభివృద్ధి నమూనా లో ఎమ్ఎస్ఎమ్ఇ లను బలపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. "వీధి వ్యాపారస్తులు మన యాత్ర లో ఒక భాగం. మనం వారి కష్టాల ను అడుగడుగునా గమనించాలి. వారి కోసం మేం పిఎమ్ స్వనిధి యోజన ను ప్రవేశపెట్టాం. ఈ పథకం చాలా బాగుంది. మీ నగరం లో ఉన్న వీధి వ్యాపారుల జాబితా ను తయారు చేసి, మొబైల్ ఫోన్ ద్వారా లావాదేవీల ను జరపడాన్ని గురించి వారికి నేర్పించండి. ఇది మరింత ఉత్తమమైన విధానం లో బ్యాంకు ల నుంచి వారు ఆర్థిక సహాయం పొందేందుకు తోడ్పడుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. మహమ్మారి కాలం లో వీధి వ్యాపారుల కు ఉన్న ప్రాముఖ్యం ఏమిటన్నది చాలా స్పష్టం గా అగుపించింది అని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగం చివర లో, కాశీ అభివృద్ధి కోసం మేయర్ లను వారి వారి అనుభవాల నుంచి సూచనల ను, సలహాల ను ఇవ్వవలసిందని అభ్యర్థించారు. "మీరు చేసే సూచనల కు నేను కృతజ్ఞుడినై ఉంటాను. అలాగే, నేను మీ తొలి విద్యార్థి ని అవుతాను" అని ప్రధాన మంత్రి అన్నారు. సర్ దార్ పటేల్ గారు అహమదాబాద్ మేయర్ గా సేవల ను అందించారు. మరి దేశం ఆయన ను ఈనాటి కి కూడా ను గుర్తు కు తెచ్చుకొంటున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. "దేశ ప్రజల కు సేవ చేయగలిగే అవకాశాన్ని మీరు దక్కించుకొనే ఒక సార్థక రాజకీయ జీవనం లోకి అడుగు పెట్టడానికి దోహదం చేసే ఒక మెట్టు గా మేయర్ పదవి కాగలుగుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

ఉర్సు వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

రంగారెడ్డి, డిసెంబర్ 18:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ 128 డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి కాలనీలో గల హజరత్ జిందా షా మదర్ దర్గా వద్ద ఈ నెల 22, 23వ తేదీల్లో ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను ఈరోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే తన నివాసం వద్ద మైనార్టీ సోదరులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రెసిడెంట్ మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, దర్గా కమిటీ మెంబర్స్ బాబుమియా, గౌస్, నిజాం, పాషా, అయుబ్, బాబుజని, యూసుఫ్, వార్డు సభ్యులు అబ్దుల్ రహీమ్, సిద్దిక్, మసూద్, ఇబ్రహీం, అల్లావుద్దీన్, మంజూర్ పాల్గొన్నారు.

2030 నాటికి సేవలు , సరుకుల ఎగుమతుల ద్వారా లక్ష కోట్ల డాలర్లు సాధించడం సాధ్యం - శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:వాణిజ్యం , పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం , ప్రజాపంపిణీ , జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్‌గోయల్ భారతీయ పరిశ్రమ పురోగమన లక్ష్యాలను భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకోనున్న 2047 నాటికి సాకారం అయ్యేట్టు నిర్దేశించుకోవాలని, పరివర్తనాత్మక మార్పులను సాధించాలనే లక్ష్యంతో పనిచేయాలని ఈరోజు కోరారు.

ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) 94వ వార్షిక సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు.

మహమ్మారి కారణంగా ఎదురైన సవాళ్లు , అనిశ్చితి నేపథ్యంలో దుబాయ్ ఎక్స్‌పోలో భారత వాణిజ్య ప్రదర్శనా ప్రాంగణాన్ని సాకారం చేసినందుకు మంత్రి ఫిక్కీకి తన అభినందనలు తెలియజేశారు. దుబాయ్ ఎక్స్‌పోలో అత్యధికంగా సందర్శించిన , ప్రశంసించిన వేదికలలో భారతీయ వాణిజ్య ప్రాంగణం ఒకటి.

దుబాయ్ ప్రయోగాన్ని ఢిల్లీ ప్రగతిమైదాన్‌లో పునరావృతం చేయాలని, తద్వారా దేశం నలుమూలల నుండి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు , యువకులు మన దేశ పురోగతి , విజయాలను సందర్శించడానికి, అన్వేషించడానికి , గర్వపడటానికి అవకాశం లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

మహమ్మారి సమయంలో భారతీయ పరిశ్రమలు ఎదుర్కొన్న సవాళ్లపై దృష్టి సారించిన శ్రీ గోయల్, పరిశ్రమల రంగం మెరుగ్గా కోలుకుందనీ , వేగవంతమైన అభివృద్ధికి సిద్ధంగా ఉందని చెప్పారు. సేవల ఎగుమతిలో సాధించిన వృద్ధిని ప్రస్తావించిన మంత్రి, వి400 బిలియన్ల (నలభైవేల కోట్ల) విలువ కలిగిన సరుకుల ఎగుమతి లక్ష్యం వాస్తవం కాబోతుందని అన్నారు.

ప్రభుత్వం, పరిశ్రమలు సమష్టిగా పనిచేసి మన లక్ష్యాలన్నింటినీ ఆచరణ సాధ్యం చేసినట్లయితే, లక్ష కోట్ల (ట్రిలియన్) డాలర్ల సేవలు , సరుకులను 2030 నాటికి ఎగుమతి చేయాలనే ఆశయంతో విజయాలు సాధించాలన్నదే ఈ సంక్షోభం నుంచి నేర్చుకున్న పాఠమని మంత్రి అన్నారు. మనం దానిని కూడా సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేసారు.

సంస్థాగత మార్పులతో పురోగతి సాధ్యమని ప్రభుత్వం అనుకోవడంలేదని, ప్రతి అవకాశాన్ని పరిశుభ్రత, పారిశుధ్యం, వంటగ్యాస్ కనెక్షన్ లేదా విద్యుత్తు లేదా ఆరోగ్య సంరక్షణ వంటివి ఏవైనా కానీ విజయవంతంగా అందించడానికి కృషి చేసిందని మంత్రి అన్నారు. సాంకేతిక విజ్ఞానం సహాయంతో పద్ధతి ప్రకారం అందరికీ నాణ్యమైన, సరసమైన ఆరోగ్య సంరక్షణను అందించాలనే దృక్పథంతో ఆరోగ్య రక్షణను ప్రాధాన్యతగా తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

జీవన సౌలభ్యం , వ్యాపార సౌలభ్యాల్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల గురించి శ్రీ గోయల్ మాట్లాడుతూ, ఒక సంవత్సరంలో 22,000 ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను నివారించామని, మరిన్ని విజయాలు సాధించడానికి మార్గాన్వేషణ చేస్తున్నామని చెప్పారు.

ప్రపంచం భారతదేశాన్ని విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని, ముఖ్యంగా మహమ్మారి సమయంలో మనం ప్రదర్శించిన దృక్పథం కారణంగా వ్యాపారం, పరిశ్రమలు నిర్దేశించుకున్న అంతర్జాతీయ అంచనాలను అందుకున్నది సమిష్టి నిబద్ధత వల్లనే అని మంత్రి అన్నారు. కోవిడ్ కాలంలో భారతీయ పరిశ్రమ సవాళ్లను స్వీకరిస్తూ ప్రత్యేక సామర్థ్యాన్ని ప్రదర్శించింది , అందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి అని మంత్రి పేర్కొన్నారు.

శ్రీ గోయల్ ప్రధాన మంత్రి వ్యాఖ్యానాన్ని గుర్తుచేస్తూ , మనకు శతకోటి సమస్యలు ఉన్నప్పటికీ, ఆ సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి శతకోటి మనస్సులు ఉన్నాయని అన్నారు. అత్యున్నత స్థాయి సమగ్రత, కనీస ప్రభుత్వం-గరిష్ట పాలన, జీవన సౌలభ్యం, సులభ వ్యాపార మార్గాలు మొదలైన వాటిపై దృష్టి సారిస్తూ ప్రచారం చేయడానికి , ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్న గొప్ప ఆదర్శ పాలన భారతదేశానిది అని ఆయన అన్నారు.

కొత్త ఆలోచనలు వినడానికి, వాటిని ప్రతి స్థాయిలో పరిశ్రమలతో పరస్పరం పంచుకోవడానికి , దోహదకారిగా, ఉత్ప్రేరకంగా , భాగస్వామిగా పని చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి హామీ ఇచ్చారు.

వ్యాపారం , పరిశ్రమలను ప్రోత్సహించడానికి వాణిజ్యం , పరిశ్రమల మంత్రిత్వ శాఖ తీసుకున్న చర్యలను వివరిస్తూ, కీలకమైన విధాన నిర్ణయాల నుండి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహ పథకాల వరకు సెమి కండక్టర్ పరిశ్రమకు ఇటీవల ప్రకటించిన భారీ ప్యాకేజీ వరకు ప్రస్తావిస్తూ , కొత్త అవకాశాలను తీవ్రంగా అన్వేషిస్తున్నట్లు శ్రీ పీయూష్‌గోయల్ చెప్పారు.

అమలులో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల గురించి మంత్రి ప్రస్తావిస్తూ, అరబ్ దేశాలు, కెనడా, ఇంగ్లాండులతో వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎలు) త్వరలో జరగబోతున్నాయని, యురోపియన్ కూటమి , ఇజ్రాయెల్‌తో ఒప్పందం ఇప్పటికే ప్రారంభించబడిందని మంత్రి చెప్పారు. ఆ దిశగా భారత్‌తో చర్చలు ప్రారంభించడానికి గల్ఫ్ సహకార సమితిలోని దేశాలు సైతం ఆసక్తి వ్యక్తం చేశాయని ఆయన తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఎఫ్‌టిఎతో పాటు, సరసమైన ధరలకు వాణిజ్య సముదాయాలు , గిడ్డంగులతో కూడిన ఇండియా మార్ట్ ను దుబాయ్‌లో ఏర్పాటు చేయడం వంటి ఇతర మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు శ్రీ గోయల్ చెప్పారు.

ప్రపంచ మార్కెట్‌లో భారతీయ వస్త్రాలకు, ముఖ్యంగా నాణ్యమైన చేనేత వస్త్ర వాణిజ్యానికి ఉన్న అపారమైన అవకాశాన్ని ఎత్తి చూపుతూ శ్రీ గోయల్ వస్త్ర పరిశ్రమ వాటాదారులను పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కోరారు. వ్యాపారాలు, పరిశ్రమలు గతకాలపు ఆంక్షల బారినపడకుండా పనిచేయాలని, సంప్రదాయ ఆలోచనల అడ్డంకులను ఛేదించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు

ఏపీలో మూడు రాజధానులకు మద్దతుగా ఆందోళనలు చేపడుతాం..

తిరుపతి, డిసెంబర్ 18:: ఏపీలో ఏకైక రాజధాని ఉండాలంటూ చేపట్టిన అమరావతి రైతుల ఆందోళనలకు వ్యతిరేకంగా శనివారం రాయలసీమ అభివృద్ధి సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. దీంట్లో భాగంగా తిరుపతిలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఒక రాజధాని వద్దు మూడు రాజధానులు ముద్దు అని నినాదాలు చేశారు.

సభకు అధ్యక్షత వహించిన రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, రాయలసీమ అధ్యయన సంస్థ అధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలంటే ఉత్తరాంధ్ర, రాయల సీమల్లోనూ రాజధానులు ఉండాలని అన్నారు. అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితమయితే మిగతా ప్రాంతాలు నష్టపోతాయని వారు పేర్కొన్నారు. . అమరావతిలోనే రాజధాని ఉండాలని చేసిన డిమాండ్ ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. మూడు రాజధానులకు మద్దతుగా తిరుపతిలో రిలేదీక్షలు చేపడతామని, వికేంద్రీకరణ సాధన కోసం మహా పాదయాత్రకు సిద్ధమవుతామని వారు వెల్లడించారు.

ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా సమగ్రాభివృద్ధి బిల్లుకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు.

10వ తరగతి విద్యార్థులకు శుభవార్త.. ఈ ఏడాది పదిలో ఏడు పరీక్షలే..!



అమరావతి, డిసెంబర్ 18: కొవిడ్ నేపథ్యంలో విద్యార్థులపై భారం వేయకుండా చూసేందుకు ఏపీ సర్కార్ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో పదకొండు పరీక్షలు రాసే భారాన్ని తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాదికి ఏడు పరీక్షలే జరిపి.. తిరిగి వచ్చే ఏడాది నుంచి యథావిధిగా పరీక్షలు జరుపనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కరోనా వ్యాప్తి నేపథ్యంలో 2020, 2021 లో జరుగాల్సిన పరీక్షలు రద్దయ్యాయి.

పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులపై భారం తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం పరీక్ష పేపర్లను తగ్గించింది. 11 పేపర్లకు బదులుగా 7 పేపర్ల విధానాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సవరణ జీఓ ఇచ్చింది. ఈ మేరకు పేపర్ ప్యాటర్న్‌లో కూడా మార్పులు చేశారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి కూడా 7 పేపర్లే ఉంటాయి. సైన్స్ మినహా అన్ని సబ్జెక్టులకు ఒకే పేపర్ ఉంటుంది. మొత్తం 100 మార్కులకు 33 ప్రశ్నలిచ్చి సమాధానాలు రాయమంటారు. పరీక్షా సమయం 3.15 గంటలుగా నిర్ణయించారు. ప్రభుత్వం అందించే 24 పేజీల బుక్‌లెట్‌లోనే సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబ

ఆహార భద్రత కార్డుల జారీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది..

-యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్

కరీంనగర్ డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి): పేదలకు ఆహార భద్రత కార్డుల జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ ఆరోపించారు. శనివారం కరీంనగర్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని ప్రకటించి నెలల తరబడి ఆన్ లైన్ సైట్ లో పెండింగ్ చూపించడం సిగ్గుచేటన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్వంత నియోజకవర్గంలో పేద ప్రజలు రేషన్ కార్డుల కోసం ఇబ్బందులు ఎదుర్కొవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం చెప్పే మాటలకు అమలు చేసే హామీలకు పొంతన లేకుండా పోయిందని ప్రజలు ప్రభుత్వ తీరుపై నవ్వుకుంటున్నారని ఎద్దేవ చేశారు. ప్రభుత్వానికి, పౌర సరఫరాల శాఖ మంత్రి కి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సైట్ ను పునరుద్ధరించి రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ను మొదలు పెట్టేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యూత్ కాంగ్రెస్ పేద ప్రజల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.

జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలువడమే లక్ష్యం

-టి యూడబ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచర్ల లక్ష్మీ నారాయణ

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి):విధి నిర్వహణలో ఉంటూ మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలుస్తూఆర్థిక భరోసాను కల్పిస్తున్న సంస్థ దేశంలోనే తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి మాత్రమే అని. టి యూ డ బ్ల్యూ జే రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచర్ల లక్ష్మీ నారాయణ అన్నారు.వేములవాడ కు చెందిన జర్నలిస్ట్ బూర రమేష్ కరోన తో మరణించగా ,తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ నుండి మంజూరైన 2 లక్షల రూపాయల చెక్కును ఆయన సతీమణి బూర ఉమకు ,జిల్లా అధ్యక్షులు రాచర్ల లక్ష్మీ నారాయణ ,ప్రధాన కార్యదర్శి తీగల మల్లికార్జున్ లుఅందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచర్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రికేసీఆర్,తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ప్రత్యేక చొరవతో జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారని ఇప్పుడు ఈ నిధి జర్నలిస్టుల పెన్నిధిగా మారిందని తెలిపారు. దేశంలోనేఏ రాష్ట్రంలో లేని విధంగా జర్నలిస్టుల సంక్షేమం కొరకు, అల్లం నారాయణ చొరవతో జర్నలిస్టుల సంక్షేమ నిధిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఇందులో భాగంగా జర్నలిస్టుల సంక్షేమ నిధికి మొత్తం 42 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఇప్పటి వరకు 353 కుటుంబాలకు లక్ష రూపాయల వంతున, 116 మందికి 50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందినట్లు తెలిపారు.అంతేగాక కరోనా వైరస్ బారిన పడిన 3915 మంది జర్నలిస్టులకు తక్షణ సహాయంగా మొదటి విడత కరోనా వైరస్ బారిన పడిన వారికి 20 వేల చొప్పున, రెండవ విడత కరోనా వైరస్ బారిన పడిన వారికి 10 వేల చొప్పున 5.70 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు.ఇప్పుడు ఆర్థిక సహాయం అందించిన జర్నలిస్టు కుటుంబాలకు నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ ను అయిదేళ్లపాటు అందిస్తామని, ఆయా కుటుంబాలలోని ఒకటి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును చెల్లిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.జర్నలిస్టులకు ఒక వైపు సంక్షేమంతోపాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.మీడియాలో పని చేసే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులుఅందింజేశారని తెలిపారు.

అలాగే ఇండ్ల స్థలాలు కేటాయించారని, మరికొన్ని చోట్ల అందించడానికి కృషి చేస్తున్నట్లు, తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వార్తల కవరేజీలో భాగంగా వైద్య సిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా వారియర్స్ గా పని చేసి కరోనా వార్తలను, వాస్తవాలను సేకరించి ప్రపంచానికి తెలియజేయడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది అన్నారు.

ఆ సందర్భంలో కరోనా బారిన పడి చిన్నా పెద్ద తేడా లేకుండా అనేక మందిని కొల్పోయిన సందర్భంలో జర్నలిస్టులు కూడా కరోనా బారిన పడి మరణించడం తీవ్రంగా కలిచి వేసిన అంశం అని వారి కుటుంబాలకు 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడానికి ఉద్విఘ్నంగా ప్రకటించడం జరిగిందని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపు ప్రత్యేక చొరవ ద్వారా ఏర్పాటైన జర్నలిస్టుల సంక్షేమ నిధి ద్వారానే జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించిన ఈ ఘనత మొత్తం తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ దే అని

అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యతనిస్తూమొట్టమొదటగా తెలంగాణ ప్రెస్ అకాడమి ని ఏర్పాటు చేసి జర్నలిస్టునాయకుడు అల్లం నారాయణ ని చైర్మన్ గా నియామకం చేసినారు. తెలంగాణలోని జర్నలిస్టులకు అండగా నిలుస్తూ అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయడమే గాక ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద సుమారు 5 కోట్ల రూపాయలు జర్నలిస్టుల ఆరోగ్యం, ఆపరేషన్ ఖర్చుల కొరకు మంజూరు చేయించడం జరిగిందన్నారు.

జర్నలిట్టులకు ప్రత్యేక నిధి కల్పించి, 100 కోట్లు కేటాయించి ఇప్పటికే 500 మందికి సహాయం చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ అనిఅన్నారు. జర్నలిస్టులకు ఇలా సంక్షేమం కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వం మాత్రమే నాని అన్నారుఈ కార్యక్రమంలో టియూడ బ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి తీగల మల్లి కార్జున్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో మొక్కలు నాటిన ట్రియంప్ విల్లాస్ కాలనీ వాసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ను స్ఫూర్తిగా తీసుకొని రాజేంద్రనగర్ కిస్మతుపురాలోని త్రియంప్ విల్లాస్ కాలనీవాసులు తమ కాలనీ సమావేశం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా 25 పారిజాత మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ?. పర్యావరణ పరిరక్షణ కోసం రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అనే చాలా అద్భుతమైన కార్యక్రమం తీసుకొని ప్రజల్లో పర్యావరణం పట్ల చైతన్యం నింపడం జరుగుతుందని కొనియాడారు. తమకు పారిజాత మొక్కలు పంపిన అరుణా ఫోటో స్టూడియో యాజమాని నిమ్మల సతీష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎస్ రావు, పద్మావతి, సునీతా రెడ్డి, బీనా, వనజా, అనితా, తదితరులు పాల్గొన్నారు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రి సత్యవతి రాథోడ్ క్యాంప్ ఆఫీసు ప్రారంభం

మహబూబాబాద్, డిసెంబర్ 18:: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రి క్యాంప్ కార్యాలయానికి రాష్ట్ర గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పూజలు చేసి, ప్రారంభోత్సవం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో మంత్రి కొడుకులు సునిల్ రాథోడ్, సతీష్ రాథోడ్, కోడళ్ళు సోనమ్ రాథోడ్, బిందు రాథోడ్, అక్కళ్లు, అన్నయ్య, కూతుళ్ళు, మనుమరాళ్లు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జడ్పీ చైర్పర్సన్ కుమారి బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, జడ్పీటీసి బండి వెంకట్ రెడ్డి, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, టీఆర్ఎస్ నేతలు నూకల రంగారెడ్డి, కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి, పరకాల శ్రీనివాస్ రెడ్డి, మాలే నాగేశ్వర రావు, కొమ్మినేని రవీందర్, మన్యు ప్యాట్ని, తాళ్లూరి హనుమ, కాలం రవీందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, బోడ శ్రీను, శ్రావణ్ రెడ్డి, వల్లూరి కృష్ణా రెడ్డి, నాగన్న, జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, కొమురయ్య, ఎస్పీ కోటిరెడ్డి, డీఎస్పీ సదయ్య, జిల్లా అధికారులు, నేతలు పాల్గొని సత్యవతి రాథోడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రారంభం కావడంతో సందర్శకులు, స్థానికుల ఫిర్యాదులు, విజ్ఞప్తులు స్వీకరించడానికి అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటూ పని చేస్తారని మంత్రి తెలిపారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 18:భారత ప్రభుత్వ కెపాసిటీ బిల్డింగ్ చొరవలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్ ప్రధానమైన సెంట్రల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ల్యాండ్ సర్వేను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని 16 డిసెంబర్ 2021న రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు.

డిఫెన్స్ ఎస్టేట్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన డొమైన్ స్పెషలైజేషన్‌లో భాగంగా నిరంతరం భూ సర్వేలను నిర్వహిస్తుంది.

తద్వారా ఈ కార్యాచరణ రంగంలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డ్రోన్ సర్వేలు మరియు శాటిలైట్ ఇమేజరీ ఆధారిత సర్వేల వంటి అభివృద్ధి చెందుతున్న సర్వే టెక్నాలజీలలో ప్రత్యేకంగా సర్వేలలో పాల్గొనే ప్రభుత్వ అధికారులు మరియు సాంకేతిక సిబ్బంది శిక్షణ అవసరాలను తీరుస్తుంది. ఈ రోజుల్లో డిజిటల్ ఫోటోగ్రామెట్రిక్ టెక్నిక్‌లు, హై-రిజల్యూషన్ శాటిలైట్ ఇమేజరీ, ఎయిర్‌బోర్న్ మరియు టెరెస్ట్రియల్ లేజర్ స్కానర్ పరికరాల ఆధారంగా రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లు రేఖాగణిత సర్వేయింగ్ మరియు మోడలింగ్ కోసం శక్తివంతమైన సాధనాల సమితిని అందించగలవు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సర్వేలో అటువంటి కొత్త పద్ధతులపై దృష్టి సారించింది. ఈ విషయంలో అభివృద్ధి చేయబడిన నైపుణ్యం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించబడే ప్రాతిపదిక మరియు ప్రత్యేక కోర్సులకు పాల్గొనేవారిని స్పాన్సర్ చేయడానికి సిద్ధంగా ఉన్న స్వయంప్రతిపత్త సంస్థలతో సహా ఇతర కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో భాగస్వామ్యం చేయబడుతుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎన్ఆర్ఎస్సి, ఎన్ఐజిఎస్‌టి, ఎస్‌పిఎ ఢిల్లీ వంటి ప్రీమియర్ సంస్థల నుండి సేవలను పొందుతుంది. సర్వే పరిశ్రమకు చెందిన నిపుణులను రిసోర్స్ ఫ్యాకల్టీగా పొందుతుంది.అతి త్వరలో ఇన్‌హౌస్ సామర్థ్యాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉంది.

రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ..నిరంతర ప్రాతిపదికన భూ సర్వే చేపట్టాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాండ్ సర్వేను ఏర్పాటు చేయడానికి మార్గనిర్దేశం చేసినందుకు డిఫెన్స్ ఎస్టేట్ డిపార్ట్‌మెంట్‌ను సత్కరించారు. మరియు ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా సదుపాయాన్ని తెరవడానికి గల ఆవశ్యకతను కూడా రక్షణమంత్రి నొక్కి చెప్పారు.

ఈ సందర్భంగా డిజిడిఇ శ్రీ అజయ్ కుమార్ శర్మ మాట్లాడుతూ డిజిడిఇ కెపాసిటీ బిల్డింగ్ ప్రాసెస్‌లో భాగంగా డిఫెన్స్ సెక్రటరీ డాక్టర్ అజయ్ కుమార్ చెప్పిన ఆలోచనా ప్రక్రియలో ఎన్ఐడిఎమ్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఒక పరాకాష్ట అని తెలియజేసారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని జాతీయ రంగంలోకి తీసుకురావడానికి, తాజా టెక్నిక్‌లలో సర్వే కోసం ఒక ప్రీమియర్ ట్రైనింగ్ సెంటర్‌గా మారడానికి తీసుకోబడిందని తెలిపారు.

మాజీ మజీద్ కమిటీ ముస్తఫా ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న యువకునికి ఆర్థికసాయం -చికిత్స నిమిత్తం ఆదుకోండి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి):సిరిసిల్ల పట్టణం లోమాజీ సిరిసిల్ల మాజిద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చాంద్ నగర్, పల్లె నిజామాబాద్ కు చెందిన సయ్యదు సహాబ్, 17 సంవత్సరాల యువకుడు బ్లడ్ క్యాన్సర్ చికిత్స నిమిత్తం 10,000/ - రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు

ఈ సందర్భంగా మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ముస్తఫా మాట్లాడుతూచికిత్స నిమిత్తం దాతలు ఎవ్వరైనా ముందుకు వచ్చి మీకు తోచిన విరాళాలు అందిస్తే సయ్యదు సాహాబ్ సభ్యులకు అందజేయడం జరుగుతుంది అని అన్నారు .ఏదైనా ఆర్థిక సహాయం అందించిన మాకు ఆదుకోవాలని యువకుడి కుటుంబ సభ్యులు కోరారు

ఈ కార్యక్రమంలో ఎండీ షఫీ , మార్కెట్ కమిటీ డైరెక్టర్, మరియు కమిటీ సభ్యులు ఎండీ రిజ్వాన్ , ఇంమాతజ్ ఖాజా,మన్సూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్
కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం, నాగర్‌కర్నూల్
సంయుక్త నిర్వహణలో
శ్రీమతి గున్న ఆండాలమ్మ గారి స్మారకార్థం
అవార్డుల ప్రదానోత్సవం
కపిలవాయి లింగమూర్తి గ్రంథావిష్కరణలు "దేవుడు జీవుడు" "విశ్వకర్మ పురాణం"
డా॥ కపిలవాయి లింగమూర్తి సాహిత్య పురస్కారం - 2019
పురస్కార గ్రహీత డా॥ శ్రీరంగాచార్య
పూర్వ ప్రధానాచార్యులు, ప్రాచ్యకళాశాల, పాలెం
కపిలవాయి కిశోర్‌బాబు యువకవి పురస్కారం - 2019
పురస్కార గ్రహీత డా॥ పి. భాస్కర యోగి
ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి
సభాకార్యక్రమం
సభాధ్యక్షులు : ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి గారు
అధ్యక్షులు, జాతీయ సాహిత్య పరిషత్
ముఖ్య అతిథి : శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు
వ్యవసాయ శాఖమాత్యులు, తెలంగాణ ప్రభుత్వం
డా॥ కపిలవాయి లింగమూర్తి సాహిత్య పురస్కార ప్రదాత
విశిష్ట అతిథులు : శ్రీ మర్రి జనార్ధన్ రెడ్డి గారు
యం.ఎల్.ఏ. నాగర్ కర్నూల్, అధ్యక్షులు, యం.జె.ఆర్. ట్రస్ట్
కపిలవాయి కిశోర్ బాబు యువకవి పురస్కార ప్రదాత
జస్టీస్ ఎ. రామలింగేశ్వర రావు గారు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి
దేవుడు జీవుడు పుస్తకావిష్కర్త
డా॥ కె.వి. రమణాచారి గారు
విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
విశ్వకర్మ పురాణం పుస్తకావిష్కర్త
గౌరవ అతిథులు : శ్రీ మామిడి హరికృష్ణ గారు
సంచాలకులు తెలంగాణ భాషా సాంస్కృతిక సంస్థ
ఆత్మీయ అతిథులు
శ్రీ యన్నం రుక్మాంగద రెడ్డి గారు
ప్రముఖ కవి
శ్రీ గున్న రాజేందర్ రెడ్డి గారు
అధ్యక్షులు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలి, గాంధీ జ్ఞాన ప్రస్థాన్
శ్రీ బి.వి. భాస్కరా చారి గారు
ప్రముఖ కవి, సినీ దర్శకులు
శ్రీ లాలకోట వెంకటాచారి గారు
గౌరవాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం
తేది : 20-12-2021 సోమవారం సాయంత్రం గం. 6.00 లకు
వేదిక : రవీంద్రభారతి సెమినార్ హాల్, హైదరాబాద్.
సభాసమన్వయం
ఎన్. వి. రఘువీరప్రతాప్
డా॥ కసిప నరేందర్
ఆహ్వానం
కపిలవాయి అశోక్ బాబు
కార్యదర్శి, డా॥ కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం
సెల్ : 87907 27772

ఈ నెల 20 నుంచి 26 వరకు.. 'గుడ్ గవర్నెన్స్' వీక్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: ఈ నెల 20 నుంచి 26 వరకు.. 'గుడ్ గవర్నెన్స్' వారంగా కేంద్ర ప్రభుత్వం జరుపనున్నది. ఇందులో భాగంగా ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, సేవలను మెరుగుపరిచేందుకు 'ప్రశాసన్ గావ్ కీ ఔర్' పేరుతో దేశ వ్యాప్తంగా ప్రచారాన్ని చేపట్టనున్నది. ప్రజా ఫి ర్యాదులను పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శిబిరాలు, కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపింది. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (ఆంఖీఖఉ) ఈ మేరకు శనివారం ప్రకటించింది. ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, ప్రభుత్వ సేవలను మెరుగుపర చడం కోసం 'గుడ్ గవర్నెన్స్' వీక్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

కాగా దివంగత మాజీ ప్రధాని అటల్ వాజ్‌పేయి జయంతి రోజైన డిసెంబర్ 25ను 'గుడ్ గవర్నెన్స్' డేగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అయితే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు అయిన సందర్భంగా ఏడాదిపాటు ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని కేంద్రం నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఈసారి ఈ నెల 20 నుంచి 26 వరకు 'గుడ్ గవర్నెన్స్' వీక్ కింద పలు కార్యక్రమాలు చేపడుతున్నది.

ఆర్మీ హెలికాప్టర్ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ: ఎయిర్ చీఫ్ వీఆర్ చౌదరీ

హైదరాబాద్, డిసెంబర్ 18: తమిళనాడులోని కూనురు వద్ద జరిగిన ఆర్మీ హెలికాప్టర్ ప్రమాదంలో సీడీఎస్ చీఫ్ జనరల్ రావత్‌తో పాటు మొత్తం 14 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఆ ఘటనపై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ చాలా నిష్పక్షపాతంగా జరుగుతున్నట్లు ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరీ తెలిపారు. హైదరాబాద్‌లోని దుండిగల్ వైమానిక దళ అకాడమీలో ఇవాళ జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాలొన్నారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ.. సీడీఎస్ రావత్ దంపతులు, మరో 12 మంది రక్షణదళ సిబ్బంది మృతి పట్ల ఆయన నివాళి అర్పించారు. సీడీఎస్ రావత్ మృతి కేసులో కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ చాలా ఫెయిర్‌గా జరుగుతోందన్నారు. అయితే ఇప్పుడు ఆ దర్యాప్తుకు చెందిన అంశాలను వెల్లడించలేనన్నారు. ప్రతి చిన్న కోణాన్ని కూడా పరిశీలించాల్సి వస్తోందన్నారు. హెలికాప్టర్ ప్రమాదం జరగడానికి దారి తీసిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు ఎయిర్ చీఫ్ వీఆర్ చౌదరీ తెలిపారు. కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో పాల్గొన్న ఎయిర్ చీఫ్ మార్షల్ గౌరవ వందనం స్వీకరించారు. సంపన్నమైన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు మీలాంటి చురుకైన క్యాడెట్లు అవసరమని ఆయన అన్నారు. మీరు ప్రదర్శిస్తున్న అత్యున్నత ప్రమాణాలు.. భవిష్యత్తులో ప్రభావంతమైన ఆపరేషన్లు చేపట్టేందుకు మూలంగా నిలుస్తుందన్నారు.

పేదల జీవితాలతో చెలగాట మాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

-కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిత్యవసర ధరల పెరుగుదలపై నిరసన

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి):ఉత్తరప్రదేశ్లో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ పాదయాత్ర నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో నిరసనగా నిరసన తెలుపుతున్నారు నిరసన మద్దతుగా శుక్రవారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పా పురం రాజీవ్ గాంధీ విగ్రహం నుండి వేములవాడ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టడం జరిగింది కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు నిత్యావసర ధరల పై పాదయాత్ర సందర్భంగా శుక్రవారం వారికి మద్దతుగా వేములవాడ రాజీవ్ గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టడం జరిగిందని అన్నారు కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలు ఆమాంతం పెరిగిపోవడం జరిగిందని వెంటనే నిత్యావసర ధరలతో పాటు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను కూడా తగ్గించాలని వారు డిమాండ్ చేశారు కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రేషన్ సరుకులు బియ్యం తో పాటు నిత్యావసర వస్తువులు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన ఉన్నారు వెంటనే నిత్యావసర ధరలతో పాటు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకట స్వామి అర్బన్ రూరల్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య వకుళాభరణం శ్రీనివాస్ చందుర్తి మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి ఓబీసీ జిల్లా అధ్యక్షులు మోడీగె చంద్రశేఖర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి చిలుక రమేష్ చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కదిరే రాజ్ కుమార్, సొమినేని కరుణాకర్ పండుగ ప్రదీప్, తుమ్ మధు , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

చికిత్స నిమిత్తం గాంధీకి10 ఆర్థిక సహాయం చేసిన మనచారిటబుల్ ట్రస్ట్ .

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి): నిరుపేద కుటుంబానికి చెందిన నూకలమర్రి గ్రామస్తుడు పొత్తూరి గాంధీ ఆటోలో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు . ప్రతీరోజు ఉదయం ఆటోపై కూరగాయలు తీసుకుని వచ్చి వేములవాడ మార్కెట్ సమీపంలో కూరగాయలు అమ్ముకుని వెళ్ళేవారు . ప్రతీ రోజు కూరగాయలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్న క్రమంలో నాలుగు రోజుల క్రితం ఎదురుగట్ల వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏసీ వాహనం ఢీ కొట్టిన కారణంగా ఇతని భుజానికి మరియు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి . ప్రస్తుతం వేములవాడ పట్టణంలోని చాణక్య ఆసుపత్రిలో చికిత్స జరుగుతుంది సర్జరీకి దాదాపు 2 లక్షల వరకు ఖర్చు అవుతుంది అని డాక్టర్లు తెలపడంతో నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉన్న గాంధీ కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకోవడం చూసి చలించిన మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తమ వంతు సహాయంగా శనివారం చాణక్య ఆసుపత్రికి వెళ్లి పదివేల రూపాయలు అందించారు . సహాయం అందించిన ధాతలకు పేరు పేరున నా హృదయపూర్వక ధన్యవాదాలు . ఈ కార్యక్రమంలో మన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మోటూరి మధు , కొమ్మ నటరాజు , కట్ట శ్రీనివాస్ , లాల నర్సింగం కొమురవెల్లి శివుడు , అన్నాడి దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17వ పోలీస్ బెటాలియన్ లో స్పోర్ట్స్ మీట్ ముగింపు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ పరిధి అయిన సర్దాపూర్ నందు గల 17వ పోలీస్ బెటాలియన్ లో అడిషనల్ డి.జి.పి అభిలాష బిస్ట్, టీఎస్ఎస్ పి బెటాలియన్స్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి జరుగుతున్న బెటాలియన్